## భూసార పరిరక్షణ పై విద్యార్థినులకు శిక్షణ





**మైలవరం,జూలై 29 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలోని ఎంబిఎం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు భూసార పరిరక్షణ పై విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారులు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారిణి పాగోలు ప్రియాంక మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు నేల ఆరోగ్యం, స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ పథకం ద్వారా స్కూల్ లో మినీ సాయిల్ లాబొరేటరీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. భూసార పరీక్ష కేంద్ర వ్యవసాయ అధికారి సువర్ణ కుమారి మట్టి నమూనా సేకరణ, సాయిల్ హెల్త్ కార్డ్ యాప్ మీద అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేష్, ప్రధానోపాధ్యాయులు వై.రాజశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారి పవన్ కుమార్,రైతు సేవా కేంద్ర సహాయకుడు వేములకొండ పవన్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు సరోజినీ దేవి, పద్మజ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ గురు పౌర్ణిమ ఉత్సవ మహోత్సవాలు





**విస్సన్నపేట,జూలై 29 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ షిరిడి సాయిబాబా సేవ మంత్రం నందు శ్రీ గురు పౌర్ణిమ మహోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు సద్గురు సాయిబాబాకు కాకడ హారతి ఆరు గంటల 20 నిమిషాలకు చెందిన అభిషేకం ఎనిమిది గంటలకు అలంకరణ నిత్య పూజ ఎనిమిది గంటల 15 నిమిషాలకు పల్లకి ఉత్సవం 8 :30 నిమిషాలకు శ్రీ సాయి సహస్రనామార్చన 9:30 నిమిషాలకు గురుపూజోత్సవం 11 గంటలకు భక్తుల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను జరిపారు. 12 గంటలకు మధ్యాహ్న హారతి కార్యక్రమంలో భక్తులు వేలాది మంది పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా తిరువూరు సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే కొలిక్కిపూడి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు



**తిరువూరు,జూలై 29 (వార్తాప్రభ) :** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే కొలిక్కిపూడి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి, పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు సాయి బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేక, అర్చన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తిరువూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బాబా ఆశీస్సులు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు కూడా ఎమ్మెల్యేతో కలిసి బాబా ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరువూరు నియోజకవర్గ బిజెపి సంస్థాగత సమావేశం..



**తిరువూరు,జూలై 29 (వార్తాప్రభ) :** జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పోలె శాంతి అధ్యక్షతన సమావేశం పాల్గొన్న జిల్లా పార్టీ ఇంచార్జి తాతాజి, రాష్ట్ర మైనారిటీ మోర్చ అధ్యక్షులు చిగురు పాటి కుమార స్వామి,బిజెపి అధికార ప్రతినిధి షేక్ బాజీ, తిరువూరు ఏ ఏం సి డైరెక్టర్ అబ్బినేని చంద్ర శేఖర్. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ, వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడలో నూతన హై డిపెండెన్సీ యూనిట్ ప్రారంభం





**కాకినాడ,జూలై 29 (వార్తాప్రభ) :** మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడలో నూతనంగా ఏర్పాటు చేసిన హై డిపెండెన్సీ యూనిట్ (హెచ్ డియు)ను నేడు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ, ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యాన్ని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో, క్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు హై డిపెండెన్సీ యూనిట్ ఎంతో ఉపయోగపడుతుందని, అత్యాధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు,శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బందితో ఈ హై డిపెండెన్సీ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు.అనంతరం మెడికవర్ హాస్పిటల్, కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ళ అంజిబాబు మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా వ్యాప్తంగా,అలాగే కోనసీమ జిల్లాల్లోని అనేక మంది ప్రజలకు ఆరోగ్య సమస్యలు, శస్త్రచికిత్సల అవసరాల సమయంలో తన సొంత డబ్బులతో వైద్య సహాయం అందించిన వ్యక్తి నిమ్మకాయల చినరాజప్పని తెలిపారు.కాకినాడ, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో హై డిపెండెన్సీ యూనిట్ (హెచ్ డియు)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు నిరంతర పర్యవేక్షణ, అత్యవసర వైద్య సేవలు, మెరుగైన చికిత్స అందించేలా ఈ యూనిట్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

## గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా.. 2,500 మంది భక్తులకు అన్నసమారాధన




**హనుమాన్ జంక్షన్,జూలై 29 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. సాయిబాబా వారికి తొమ్మిది రకాల పండ్ల రసాలతో పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, పాదుకా పూజలను వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అలాగే అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గురు పౌర్ణమి సందర్భంగా పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబా ఆశీస్సులు పొందారు. భక్తులు ప్రత్యేక దర్శనం చేసుకుని పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి ఆలయానికి విచ్చేసిన సుమారు 2,500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోడేబోయిన బాబిరావు, ఈశ్వర్, తవ్వ ఆదిలక్ష్మి, లంక విజయలక్ష్మి, జి. నాగమణితో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురు పౌర్ణమి వేడుకలను విజయవంతం చేశారు. ఆలయంలో రోజంతా భక్తుల రద్దీ నెలకొని ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది.

## వీరవల్లి జెడ్పీ హైస్కూల్‌లో అశోక్ లేలాండ్ సీఎస్ఆర్ బృందం పర్యటన

● వెనుకబడిన విద్యార్థుల అభ్యున్నతికి అశోక్ లేలాండ్ చేయూత





**హనుమాన్ జంక్షన్, జూలై 29 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌ను అశోక్ లేలాండ్ సంస్థ సీఎస్ఆర్ విభాగానికి చెందిన ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ మేనేజర్, రీజినల్ హెడ్ (సీఎస్ఆర్ ఫండ్స్--సౌత్ ఇండియా) శ్రీ దామోదరన్, వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీ శశికుమార్ పాఠశాలలో అమలవుతున్న రోడ్ టు స్కూల్ ప్రాజెక్టు కార్యకలాపాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యాస పురోగతిని సమీక్షించిన వారు, వారి ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరిచేందుకు తమ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపులపాడు, మంగళగిరి మండలాల్లోని పాఠశాలల్లో ఈ ప్రాజెక్టు విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. వీరవల్లి పాఠశాలలో ఆర్పీలుగా పనిచేస్తున్న శ్రీమతి బి. తులసి కామాక్షి, శ్రీమతి రేచల్ సేవలను ప్రశంసించారు. అలాగే ప్రధానోపాధ్యాయిని శ్రీమతి పి. నిర్మల అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. బాపులపాడు మండల కోఆర్డినేటర్ శ్రీ చిన్న బ్రహ్మం ఆధ్వర్యంలో ఎల్ఎల్ఎఫ్ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీ బర్లంక చంద్రశేఖర్, శ్రీమతి జగతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవాడలో వైభవంగా గురుపౌర్ణిమ మహోత్సవాలు

● బీసెంటర్ రోడ్డు షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

● రెండు వేల మంది భక్తులకుపైగా అన్నదానం ● ఆలయ కమిటీ అధ్యక్షులు ధూళిపూడి వల్లభరావు



**విజయవాడ,జూలై 29 (వార్తాప్రభ) :** భారతీయ సంస్కృతిలో గురుపౌర్ణిమకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందని.. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమార్గాన్ని చూపే గురువును స్మరించుకుని కృతజ్ఞతలు తెలియజేసే పవిత్ర దినమే గురుపౌర్ణిమ అని విజయవాడ బీసెంట్‌రోడ్డు శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ అధ్యక్షులు ధూళిపూడి వల్లభరావు అన్నారు. శ్రీ షిరిడీ సాయిబాబా చూపిన సేవ, ప్రేమ, సమానత్వం, మానవత్వం అనే సందేశాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజ హితానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ గవర్నర్‌పేట పెద్దిబొట్లవారి వీధిలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణిమ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ వ్యవస్థాపక అధ్యక్షులు ధూళిపూడి వల్లభరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందారు. ఉదయం నుంచే షిరిడీ సాయిబాబాకు పవిత్ర అభిషేకం, అష్టోత్తర నామ పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, వేద మంత్రోచ్చారణల నడుమ హారతులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో బాబా దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురుపౌర్ణిమ సందర్భంగా సుమారు 2,000 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ప్రతి భక్తికి సాదరంగా అన్నప్రసాదాన్ని అందజేసి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల నిర్వహణను ఆలయ కార్యవర్గ సభ్యులు టి.రాజారెడ్డి, వి.రవికృష్ణారెడ్డి, సీహెచ్. శ్రీనివాసులు, గోసాల శశిధర్, సీహెచ్ శ్రీకృష్ణ, ఎ.సత్యనారాయణ, వి.అశోక్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు, షేక్ బాజీ, సీహెచ్ ప్రసాదరావు, సీహెచ్ నిరంజన్, దినేష్ కతారియా, లలిత్ కుమార్‌జైన్, కాళ్ల రాజు, సీహెచ్ రమణారెడ్డి, బత్తుల తిరుపతయ్య, కె.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పర్యవేక్షించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురుపౌర్ణిమ విశిష్టతను స్మరించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి, సేవ, ఆధ్యాత్మికతను ప్రతిబింబించిన ఈ మహోత్సవాలు భక్తుల హర్షధ్వానాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

## రైతులను ఇబ్బంది పెడుతున్న వారి నుంచి రక్షణ కల్పించండి. రైతు కర్ని వీర్రాజు



**కాకినాడ,జూలై 29 (వార్తాప్రభ) :** కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల రైతు బజార్ బజారులో ఉన్న రైతులను తీవ్ర ఇబ్బంది చేస్తున్నారనీ గత 25 సంవత్సరాలుగా అదే రైతు బజార్లో కూరగాయలు పళ్ళు అమ్ముకుంటున్న రైతులు జాయింట్ కలెక్టర్ ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. అనంతరం బయటకు వచ్చిన రైతులు మీడియాతో మాట్లాడుతూ కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల రైతు బజార్లో మాకినేని భాస్కర్ అనే వ్యక్తి రైతు బజార్ స్థలాన్ని ఆక్రమించుకుని షాపులు కట్టి రైతుబజార్లో ఉన్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అడిగితే తాము రైతులం కాదని ఇక్కడ వ్యాపారాలు చేయనీనని బెదిరిస్తున్నారని వాపోయారు. తామంతా రైతుల నేనని ఎప్పటికప్పుడు ఆద్దులు చెల్లిస్తూ వ్యాపారులు చేసుకున్నప్పటికీ అతను తమపై దౌర్జన్యం చేస్తూ కేసులు పెడుతూ ఇబ్బందులు కురిచేస్తున్నారని తమకు న్యాయం చేయాలని కర్ని వీర్రాజు. జనసేన నాయకులతో వచ్చి జెసికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన నాయకులు చింతపల్లి బన్నీ మాట్లాడుతూ వ్యవసాయ కమిటీ చైర్మన్ బొచ్చు శేఖర్ అనే వ్యక్తి వైసీపీ నాయకులతో కలిసి కూటమి నాయకులు అన్యాయం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ వైస్ చైర్మన్ బడిగంట దేవి మాట్లాడుతూ చైర్మన్ ను తాను వివరణ కోరగా ఎప్పటి వరకు ఏ విధమైన చర్యలు తీసుకోకపోగా తనకు సమాధానం కూడా చెప్పలేదని అన్నారు. జెసిని కలిసిన వారిలో కోడి శ్రీను, నీలపల్లి కామరాజు, కోరుకొండ కనకారావు, యల్ల సత్తిబాబు, గుండ్రం సతీష్ తదితరులు ఉన్నారు.

## సీతనపల్లిలో సామూహిక కుంకుమార్చన



**పెడన,జూలై 29 (వార్తాప్రభ) :** విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా బంటుమిల్లి ప్రఖండ కృత్తివెన్ను మండలం సీతనపల్లి గ్రామం గురువారం నాడు శ్రీ వనువులమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన రుద్రాక్ష అర్చన నిర్వహించారు.దుర్గవాహిని మాతృశక్తి ఆధ్వర్యంలో సుమారు వందమంది హిందూ బంధువులు పాల్గొనగా అంగరంగ వైభవంగా అమ్మవారికి సారే సమర్పించడం జరిగింది. మాతృ శక్తి సంయోజక గొట్టుముక్కల సాయిలత బంటుమిల్లి దుర్గా వాహిని సంయోజక జన్యావుల ఝాన్సీ ధర్మ ప్రచార ప్రసార సహప్రముఖ బసవాని నీలాజలం కరసేవక్ చీడే బాబురావు నాయుడు ఆర్ఎస్ఎస్ ఏకల్ పాశం శ్రీనివాసరావు గ్రామ పెద్దలు శ్రీ వనవులమ్మ అమ్మవారి ఆలయ కమిటీ పెద్దలు మహిళలు యువకులు యువకులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లా అధ్యక్షులు బూరగడ్డ శ్రీనాథ్ జిల్లా కార్యదర్శి వద్రే రాజశేఖర్ అభినందనలు తెలియజేశారు.

## మానవతా హనుమాన్ జంక్షన్ నుంచి విద్య, వైద్యానికి రూ.10 వేల ఆర్థిక సాయం



**హనుమాన్ జంక్షన్, జూలై 29 (వార్తాప్రభ) :** ఏలూరు రోడ్డులోని మానవతా హనుమాన్ జంక్షన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ సమావేశంలో విద్య, వైద్య అవసరాల కోసం ఇద్దరు లబ్ధిదారులకు మొత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఏలూరులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కడుపు ఎల్లయ్య కుమార్తె పూజితకు విద్యా ఫీజుల నిమిత్తం రూ.5,000 అందించారు. అలాగే బాపులపాడు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మురళీకృష్ణకు వైద్య చికిత్స ఖర్చుల కోసం రూ.5,000 ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, అవసరంలో ఉన్న పేద కుటుంబాలకు నిరంతరం అండగా నిలుస్తామని మానవతా హనుమాన్ జంక్షన్ సభ్యులు తెలిపారు.

## గురు పౌర్ణమి శుభాకాంక్షలు - గురువుల విశిష్టత



**తిరువూరు,జూలై 29 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఈ రోజు పవిత్రమైన గురు పౌర్ణమి సందర్భంగా సమస్త గురువులకు, ఉపాధ్యాయులకు, ఆధ్యాత్మిక మార్గదర్శకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించారు. "గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్దేవో మహేశ్వరః" అనే శ్లోకం గురువు గొప్పతనాన్ని తెలియజేస్తుంది. అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానజ్యోతిని వెలిగించే మహనీయుడు గురువు. వ్యక్తిత్వ వికాసానికి, సద్గుణాల పెంపొందింపుకు, జీవిత లక్ష్య సాధనకు గురువు మార్గదర్శకుడిగా నిలుస్తారు.గురు పౌర్ణమి రోజున గురువులను స్మరించుకోవడం, వారి ఆశీర్వాదాలను పొందడం భారతీయ సంప్రదాయం. విద్యార్థులు తమ గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, వారి బోధనలను జీవితంలో ఆచరించాలని ఈ పర్వదినం సందేశాన్ని అందిస్తుంది.ఈ పవిత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ జీవితంలో వెలుగు నింపిన గురువులను గౌరవిస్తూ, వారి ఆశీస్సులతో విజయపథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ మరోసారి అందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు. జయ కృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు గారు ఐఎంఏ అధ్యక్షులు ఎండి జనరల్ ఫిజీషియన్ తిరువూరు

## డి. ఎ.ఆర్. కాలేజీలో అథ్లెటిక్స్ సెలక్షన్స్..



**ఏలూరు జిల్లా నూజివీడు,జూలై 29 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా నూజివీడు మండలము డి.ఎ.ఆర్ కాలేజీ లో అమరావతి చాంపియన్ షిప్ లోభాగంగా ఈరోజు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ సెలక్షన్స్ నిర్వహించామని నూజివీడు నియోజకవర్గం చార్జి అన్నామణి తెలిపారు. అండర్ -17 విభాగంలో 100, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్,లాంగ్ జంప్, జావలిన్ త్రో, షాట్ పుట్. అండర్ -23 విభాగంలో 100, 400, 800 మీటర్ల పరుగుపందెం, హై జంప్, లాంగ్ జంప్, జావలిన్ త్రో, షాట్ పుట్, 5 కిలో మీటర్ల రన్నింగ్, రిలే నిర్వహించామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుని డి. పుష్పలత సెలెక్ట్ అయిన క్రీడాకారులను అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు.నియోజకవర్గములో సెలెక్ట్ అయిన క్రీడాకారులు జిల్లాస్థాయి లో సెలెక్ట్ అయి నూజివీడు నియోజకవర్గానికి మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. ఈకార్యక్రమములో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, లక్ష్మి, బాలబాస్కర్, రవీంద్ర,సుగుణ రావు, శివనాగేంద్రం, సుకుమార్, వనజ, స్వప్న, ఆరతి, రాణి, సరళ, ప్రభాకర్, వాసు, సతీష్, నాగరాజు, సాయి కిషోర్,అన్నపూర్ణ,హేమ,నారాయణ, శ్రీహరి, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతిలో విశిష్ట సాంప్రదాయం గురుపౌర్ణమి

**సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,జూలై 29 (వార్తాప్రభ):** గురుపౌర్ణమి సందర్భంగా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ ఫేజ్–2లో ఉన్న సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ గురుపౌర్ణమి లేదా వ్యాసపౌర్ణమి రోజున గురువులను, ఉపాధ్యాయులను, పెద్దలను సత్కరించి వారి ఆశీర్వాదాలు పొందడం భారతీయ సంస్కృతిలో విశిష్ట సంప్రదాయమని అన్నారు. మానవాళికి ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించిన వేదవ్యాస మహర్షి జయంతి కావడంతో ఈ రోజుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. గురువు భగవంతుడు, భక్తుని మధ్య సంధానకర్త అని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించి జీవితానికి మార్గదర్శకత్వం వహించే గురువుల పట్ల గౌరవం ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, ఇతర నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

**గురుపూర్ణిమ సందర్భంగా సాయిబాబాను దర్శించుకున్న నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి.**



**కీసర, నాగారం, జూలై 29:(వార్తా ప్రభ):** నాగారం డివిజన్ పరిధిలోని సింహపూరి కాలనీ, సత్యనారాయణ కాలనీ, రాజ్‌సుఖ్‌నగర్ కాలనీల సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ సందర్భంగా బాబా ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి. నాగారం డివిజన్ ప్రజలందరికీ గురు పూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ బండారు మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు లావణ్య శ్రీనివాస్, సుమిత్ర సురేష్, గనపురం కొండలరెడ్డి, మాజీ ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి ప్రవీణ్ కుమార్, పంగ సంతోష్, గనపురం గోపాల్ రెడ్డి, మురళి చారి, జే. దాస్, ఉమ శంకర్ గౌడ్, రవిందరరెడ్డి, రమేశ్, కాలనీ వాసులు, సాయిబాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతిలో గురువుకి అత్యున్నత స్థానం

**సాయిబాబా దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్**



**శేరిలింగంపల్లి,జూలై 29 (వార్తాప్రభ):** గురుపౌర్ణమి సందర్భంగా కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వర నగర్ కాలనీలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన మహోత్సవాల్లో మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని పేర్కొంటూ ప్రజలకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలు



**మల్కాజిగిరి :జూలై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వినాయక్‌నగర్ డివిజన్‌లో సంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలను బుధవారం సుమంగళి హాల్‌లో ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి దీపప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, ఎస్ఐఆర్ ఇన్‌చార్జి వాసంశెట్టి శ్రీనివాస్ హాజరై సంత్ రవిదాస్ మహారాజ్ సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన బోధనలు సమాజంలో సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయానికి మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఓం ప్రకాష్, మంగేష్, మల్లేష్ యాదవ్, ఉడతా నవీన్, నర్సింగ్ రావు, మల్లేష్, సాయి సురేష్, శ్రీదేవి, సుమలత, సోమంద్, వెంకటేష్, రెడ్డి, రమేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు

- పద్మానగర్, బ్యాంక్ కాలనీ, బౌద్ధనగర్ సాయిబాబా దేవాలయాల్లో దర్శనాలు
- పేట్ బషీరాబాద్, బౌద్ధనగర్‌లో భక్తులకు అన్నసంతర్పణ





**కుత్బుల్లాపూర్, జూలై 29, (వార్తాప్రభ) :** పవిత్ర గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలు ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పద్మానగర్ 2, బ్యాంక్ కాలనీ మరియు బౌద్ధనగర్‌లలో వేంచేసి ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. బీఆర్ఎస్ నాయకుడు కుంట సిద్దిరాములు, పోగు సమ్మయ్య నేత, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి ఆయా దేవాలయాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం పలు చోట్ల భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమాలు చేపట్టారు. పేట్ బషీరాబాద్ పరిధిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకుడు అనిల్ గౌడ్‌తో కలిసి కుంట సిద్దిరాములు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే బౌద్ధనగర్ సాయిబాబా దేవాలయం వద్ద ఆలయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు కృష్ణతో కలిసి భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురుదేవుని ఆశీస్సులు, దివ్య అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఆలయ కమిటీ ప్రతినిధులు, సంక్షేమ సంఘాల బాధ్యులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్



**జవహర్ నగర్, జూలై 29:(వార్తా ప్రభ):** మల్కాజ్గిరి కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ, జవహర్ నగర్, చంద్రపురి కాలనీ, శామీర్‌పేట్ డివిజన్లలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం ఎస్ ఐ ఆర్ ఇంచార్జి గజ్జల కాంతం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బి ఎల్ ఓ లు), బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ లు), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, ఎవరూ అన్యాయంగా తొలగించబడకుండా ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో పరిశీలనలు చేపట్టాలని సూచించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, జిల్లా ఆర్టీవో మెంబెర్ జైపాల్ రెడ్డి, దమ్మాయిగూడ, జవహర్ నగర్, చంద్రపురి కాలనీ, శామీర్ పేట్ డివిజన్ల అధ్యక్షులు ముప్పు రామ రావు, శ్రీకాంత్ యాదవ్, నక్క సందీప్ గౌడ్, జవహర నగర్, మాజీ మేయర్ డివిజన్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్, జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శంకర్ గౌడ్, బూడిద వెంకటేష్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్లు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బి ఎల్ వో లు, బిఎల్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి))** కలెక్టరేట్, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న బ్లాక్ స్పాట్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రహదారులపై పశు వుల సంచారం అధికంగా ఉండటం వల్ల, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు . రహదారులపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, సీటు బెల్టులు ధరించకపోవడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 42 బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలకు సంబంధించిన పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంట ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు 'గోల్డెన్ అవర్'లో సకాలంలో వైద్య సేవలు అందేలా బ్లాక్ స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో జనవరి నుండి ఇప్పటివరకు 289 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయని అధికారులు వివరించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఈ నాగేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి అనూష సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామ్కీ గో బ్యాక్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

- చెత్త సేకరణ కార్మికుల హక్కులను కాపాడాలి
- గుత్తేదారుల పెత్తనం సహించం
- ప్రైమరీ కలెక్షన్ కార్మికులకే కొనసాగించాలని డిమాండ్





**కుత్బుల్లాపూర్, జూలై 29 (వార్తాప్రభ) :** ఐడిపిఎల్‌లోని ఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో కుత్బుల్లాపూర్ జోన్ స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "రామ్కీ గో బ్యాక్" కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ కార్మికుల సమస్యలు, వారి ఉపాధి భద్రత, గుత్తేదారుల జోక్యంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం చెత్త సేకరణ చేసే కార్మికుల పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ డిస్టర్బ్ చేయరాదని స్పష్టం చేశారు. పని చేసేది కార్మికులే అయినప్పుడు, వారి శ్రమ ఫలితాలు కూడా వారికే దక్కాలని పేర్కొన్నారు. కార్మికులపై ఎవరూ పెత్తనం చెలాయించకూడదని, వారి జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. గుత్తేదారుల పెత్తనాన్ని సహించేది లేదని హెచ్చరించిన ఆయన, సియంసీ పరిధిలోని ప్రైమరీ చెత్త సేకరణ వ్యవస్థను కార్మికులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. చెత్త సేకరణ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల కుటుంబాల జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ మాట్లాడుతూ, కార్మికుల పొట్టకొట్టే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. కార్మికుల హక్కులను హరించే చర్యలను అడ్డుకుంటామని, వారి ఉపాధికి భంగం కలిగించే వారిని సహించబోమని హెచ్చరించారు. కార్మికుల జోలికి వస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, స్టీఫెన్, లక్ష్మారెడ్డి, కృష్ణ, వెంకన్న, నరసింహ, రంగన్న, మల్లేష్, అంజి, జగదీష్, ఉత్తరయ్య, ప్రశాంత్, దస్తగిరి, రవి, రామకృష్ణ, అల్వాల్ శ్రీను, కుత్బుల్లాపూర్ జోన్‌కు చెందిన స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మికుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందని యూనియన్ నాయకులు తెలిపారు. చెత్త సేకరణ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో కూడా పోరాటాలు కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

# హైదరాబాద్

## 22వ డివిజన్లో రహదారికి ఇరువైపుల మొక్కలు తొలగించండి

**దోమల బెడదతో అనారోగ్య పాలవుతున్నాం**





**భద్రాద్రి కొత్తగూడెం జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, 22వ డివిజన్ రహదారికి ఇరువైపులా మొలిచిన పిచ్చి మొక్కలు, కంప చెట్లు మూలమ్మలు వద్ద నిలిచిన వర్షపు నీరు దోమలకు ఆవాసాలుగా మారి డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులకు దారితీస్తాయని రోజు రోజుకూ రోడ్డు పైకి రావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నగరపాలక అధికారులు పర్యవేక్షించడం మరిచారని అంటున్న ప్రజలు రాత్రిళ్ళు దారి వెంబటి వెళ్లాలంటే వారికి గగనమే అవుతోంది. రహదారికి ఇరు వైపులా పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డుపైకి వ్యాపిస్తున్నాయి. రోడ్డు మలుపుల వద్ద ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడటం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు గుంపుగా ఉండటంతో ఉదయం సమయంలోనే ఇలా ఉంటే ఇక రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందికరంగా ఉంటుందని ప్రమాదాలబారిన పడుతున్నామని వాహనదారులు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించే కంటే.. ముందే చర్యలు తీసుకుని మొక్కలను తొలిగించాలని నగరపాలక అధికారులను వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు."

## శేరిలింగంపల్లి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనీ సాయి నాధుడిని కోరుకున్న

## -మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రత్యేక పూజలు



**శేరిలింగంపల్లి,జూలై 29 (వార్తాప్రభ):** గురుపౌర్ణమి సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్పలోని శ్రీ షిర్డీ సాయినాథ, మార్కండేయ స్వామి, సంతాన నాగదేవత ఆలయంలో మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ చైర్‌పర్సన్, తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు సభ్యురాలు సుజాత యాదవ్‌తో కలిసి సొంత నిధులతో నిర్మించిన ఈ ఆలయంలో గురుపూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ గురువుల ఆశీస్సులతో ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని, శేరిలింగంపల్లి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షాలు నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి

**- శాసనసభ్యులు అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,జూలై 29 (వార్తాప్రభ):** హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలి నగర్ రైల్వే అండర్‌పాస్ సమీపంలోని నాలాలో ప్రమాదవశాత్తు గల్లంతైన ప్రేమ్‌నగర్‌కు చెందిన బాలయ్య(70) కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యక్షంగా పరిశీలించారు. పోలీసులు, హైడ్రా, ఎన్‌డీఆర్ఎఫ్, సీఎంసీ ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో మాట్లాడి గాలింపును వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని, వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు రక్షణ చర్యలు మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

# సంపాదకీయం

## వైసీపీ పరిస్థితి ఏంటి...జగన్ ముందున్న నివేదిక !

ఏపీలో వైసీపీకి అధికారం పోయి రెండేళ్ళకు పై మాట అయింది. అదే సమయంలో దారుణంగా ఓడి విపక్షం హోదా కూడా దక్కనంతంగా దిగనారింది. దాంతో అసెంబ్లీకి వెళ్ళలేక జనంలోకి కూడా రాలేక చాలా మంది సతమతం అవుతున్నారు. అధినాయకత్వం అయితే ఈ రెండేళ్ళలో పెద్దగా తిరిగింది లేదని అంటున్నారు. ఇక వైసీపీ కేంద్ర కార్యాలయం మాత్రం పార్టీ వారికి ఆందోళనలు నిరసనలు చేపట్టాలని కార్యక్రమాలు ఇస్తోంది. అదే సమయంలో పార్టీ కమిటీలు బూత్ లెవెల్ వరకూ వేయమని కూడా ఆదేశించింది. పార్టీని పటిష్టం చేస్తూ స్థానిక సమస్యల మీద ఆందోళలను ఎవరికి వారుగా నిర్వహించాలని ఆదేశించింది. మరి ఈ రెండేళ్ళలో వైసీపీ ఏ మేరకు సక్సెస్ అయింది. నేతల పరిస్థితి ఏమిటి, ఏపీలో మూడు రీజియన్లలో వైసీపీ ప్రస్తుతం పొజిషన్ ఎలా ఉంది అన్నది అయితే చర్చ సాగుతోంది. అయితే దీని మీద పార్టీ నేతలు చెప్పే మాటలు కాకుండా అధినేత జగన్ సొంతంగా ప్రైవేట్ సర్వే చేయించారు అని అంటున్నారు. ఈ నేపథ్యంలో జగన్ వద్దకు సదరు ప్రైవేట్ సంస్థ చేసిన సర్వే నివేదిక ఉందని అంటున్నారు. అందులో ప్రతీ నియోజకవర్గంలో నేతల జాతకాలతో పాటు పార్టీ పరిస్థితి కూడా స్పష్టంగా ఉందని అంటున్నారు. ఇక వైసీపీ నేతలలో ఈ రెండేళ్ళలో గట్టిగా ఎక్కడ పనిచేశారు అన్నది చూస్తే కనుక రాయలసీమ నేతలే బెటర్ అని ఆ సర్వే నివేదికలో వచ్చింది అని అంటున్నారు.ఏపీలో కోస్తా, గోదావరి ఉత్తరాంధ్రా జిల్లాలలో అయితే వైసీపీ నేతలు పెద్దగా పనిచేయడం లేదని ఈ సర్వే నివేదిక ఉన్నది ఉన్నట్లుగా చెప్పేసింది అని అంటున్నారు. ఎక్కడ అయినా సొంతంగా ప్రజా సమస్యలను గుర్తించి నాయకులు పనిచేయడం లేదని కూడా సర్వే ప్రకారం అధినాయకత్వానికి అర్థం అయింది అని అంటున్నారు. అంతే కాకుండా పార్టీని పెద్దగా పట్టించుకోని వారే అధికంగా ఉన్నారని కూడా చెబుతోంది ఈ సర్వే. దాంతోనే వైసీపీ అధినాయకత్వం అప్రమత్తం అయింది అని అంటున్నారు.వైసీపీకి 2029 ఎన్నికలు చాలా ఇంపార్టెంట్ అని అంటున్నారు. ఎంతలా అంటే చావో రేవో అన్నట్లుగానే అని గుర్తు చేస్తున్నారు. వరుసగా రెండు సార్లు ఓటమి చెందితే వైసీపీకి రాజకీయంగా ఎంతో ఇబ్బంది అవుతుంది అని అంటున్నారు. ఆ సంగతి అధినాయకత్వానికి బాగా తెలుసు అని అందుకే నాయకులతో వరస మీటింగ్స్ ని జగన్ ఏర్పాటు చేసి వారి పనితీరు మార్చుకోవాలని ఒకటికి పది సార్లు చెబుతున్నారని అంటున్నారు. ఈ మధ్య కూడా ఒక జిల్లా సమావేశంలో నేతల పనితీరు మీద ఆయన సర్వే నివేదికలో ఉన్న వివరాలను బయటపెట్టి ప్రశ్నించారు అని అంటున్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు ఏపీలోని మొత్తం 175 సీట్లలోని వైసీపీ ఇంచార్జిలకు ఒక అగ్ని పరీక్ష అని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల్లో వైసీపీకి విజయాన్ని చేకూర్చాలని జగన్ గట్టిగా కోరుకుంటున్నారు. ఇక ఏకగ్రీవాలు అయితే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరికలు చేస్తున్నారు. ఏపీలో వైసీపీకి గట్టి ఓటు షేర్ ఉందని జగన్ నాయకులకు చెబుతున్నారు. రెండేళ్ళ వ్యవధిలోనే కూటమి పట్ల జనంలో తీవ్ర వ్యతిరేకత ఉందని ఈ అవకాశాన్ని వాడుకుని పార్టీకి విజయాలు అందించాలని ఆయన గట్టిగానే చెబుతున్నారు. స్థానిక సమరంలో వైసీపీకి సీట్లు తెచ్చి మొనగాడు అనిపించుకున్న వారికే 2029లో టికెట్లు అని కూడా జగన్ డిసైడ్ అయ్యారని అంటున్నారు. మరి రెండు నెలల వ్యవధిలో జరగబోయే లోకల్ ఫైట్ లో వైసీపీ నేతలు ఎంత వరకూ నిలబడి కూటమితో కలబడి సీట్లూ ఓట్లూ తెస్తారో చూడాల్సి ఉందని అంటున్నారు. తేడా వస్తే వైసీపీలో సీటు ఆశ వదిలేసుకోవాల్సిందే అన్నట్లుగా అధినాయకత్వం హెచ్చరికలు ఉంటున్నాయని అంటున్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి "మరదాప"కోటేశ్వరరావు



చెరుకుపల్లి మండలం జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఆరేపల్లి యూపీ స్కూల్ ఉపాధ్యాయులు సంగీత విద్వాంసులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన కోటేశ్వరరావు ఆధ్యాత్మిక సంగీత సేవా రంగాలలో పేరుగాంచారని వారి పదవీ విరమణ సందర్భంగా ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కోటేశ్వరరావు విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. అభిమానులు తోటి ఉపాధ్యాయులు భజన సంఘాల వారు వారికి ఘనంగా ఆహ్వానం పలికి సత్కారాలు చేశారు ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు దాససాహిత్య ప్రాజెక్టు హరే శ్రీనివాస మహిళలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఎంఈఓ నవీన్ కుమార్ లాజరు పొన్నపల్లి సత్యనారాయణ జంజనం హేమశంకరరావు చింతల మురళీకృష్ణ కాటూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 35 వ,డివిజనులో పండుగలా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం



విజయవాడ పశ్చిమ జూలై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ నగరంలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం పండుగ లా నిర్వర్తిస్తున్నారు. బుధవారం ఉదయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ బుద్ధ వెంకన్న సూచన మేరకు 35వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షురాలు బోదాల నందకుమార్ ఆధ్వర్యంలో దేవి స్ట్రీట్ నందు 239 బూత్ లో డోర్ టు డోర్ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజవర్గ పరిశీలకులు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు పాల్గొని కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు కాలంలో చేసిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించి వారి వద్ద నుండి సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కొట్టేటి హనుమంతరావు, సెక్రెటరీ అరవ పెరుమాళ్, వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా, పశ్చిమ నియోజకవర్గం ఎస్సీ సెల్ పైడిమల సుభాషిని, బూత్ కన్వీనర్ కొదమల్ రాజు, కర్రి సునీత, ఇత్తడి చార్లిస్, శ్రీరామ్ లలిత, యూనిట్ ఇంచార్జ్ కొట్టేటి సరిత, ఆసిఫ్ పటాన్, మౌనిక, దీప్తి, రాజ్యలక్ష్మి,సుహాసిని, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా అమ్మవారి రథం గిరి ప్రదక్షిణ

### అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన భక్తులు







విజయవాడ పశ్చిమ జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ఈరోజు ఘనంగా జరిగింది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు, శ్రీ విఘ్నేశ్వరుడు,శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వంటి సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రిగిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టమని పండిత ఉవాచ.పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఉదయం ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవముగా ప్రారంభం అయింది.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ), కార్యనిర్వహణాధికారి వికె శీనానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ కార్యక్రమంను ప్రారంభించారు.దేవస్థానం స్థానాచార్య వి.శివ ప్రసాద్ శర్మ తదితరులు పూజా కార్యక్రమం నిర్వహించారు.ధర్మ ప్రచారం నిమిత్తం దేవస్థానం ఏర్పాటు చేసిన సంప్రదాయ తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్ణయించిన మార్గంలో సాగింది.ఘాట్ రోడ్ శ్రీ అమ్మవారి గుడి,కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరిప్రదక్షిణ కొనసాగింది.శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లోస్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు,కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు.గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదంను భక్తులకు దేవస్థానం నుండి అందజేయడమైనది.వేలాది మంది భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు శ్రీ ఆర్. శ్రీనివాసశాస్త్రి, ధర్మ కర్తల మండలి సభ్యులు శ్రీ అవ్వారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా నిర్వహించిన ఉత్సవాలు

**● పూర్ణాహుతి తో ముగిసిన శాకాంబరీ ఉత్సవాలు ● ఇంద్రకీలాద్రి క్షేత్రంలో ఆకుకూరలు కూరగాయల అలంకారణ లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**



(యేమినేని వెంకట రమణ)

విజయవాడ పశ్చిమ జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి) దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఈవో శీనానాయక్, పాలకమండలి చైర్మన్ గాంధీఆలయ ఉద్యోగుల సమన్వయంతో భక్తులకు విశేష సదుపాయాలుఇంద్రకీలాద్రి క్షేత్ర ఖ్యాతితోపాటు ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచే విధంగా నెల రోజులుగా ఆలయ ఉద్యోగులతో శాకంబరీ ఉత్సవాలు నిర్వహణపై ఈవో శీనా నాయక్ ప్రత్యేక సమన్వయ సమావేశాలు19 ఏళ్ల శాకాంబరి ఉత్సవాల నిర్వహణలో గతానికి భిన్నంగా ప్రత్యేక అలంకరణలు, నిత్యం కదంబ ప్రసాదం పంపిణీ భారీ స్థాయిలో విచ్చేసిన భక్తజనం రాష్ట్ర ప్రభుత్వానికి భక్త జనం నుంచి మంచి పేరు తీసుకు రావడంలో విజయవంతమైన ఆలయ ఈవో 24 గంటల పాటు ఆలయ ప్రాంగణం పై ప్రత్యేక శ్రద్ధ తో అన్ని ప్రాంతాల్లోనూ అన్ని చోట్ల ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ రోజుకి మూడు గంటల సమయం మాత్రమే విశ్రాంతికి ఉపక్రమించే విధంగా ముందస్తు ప్రణాళికలు ఈ శాఖంబరి ఉత్సవాల విజయవంతంలో శీనా నాయక్ పాత్ర చెప్పుకోదగినది.నగర పోలీస్ కమిషనర్ ఎస్ వీ రాజశేఖర్ బాబు బందోబస్తు పై ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించారు .పశ్చిమ ఏసిపి దుర్గారావు అమ్మవారి ఆలయంలోనే తన విధి నిర్వహణలో చూపించిన అంకితభవం భక్తులు గుర్తు చేసుకుంటున్నారు.జై భవాని నామస్మరణతో సాగిపోతున్న భక్తుల క్యూలైన్లు పర్యవేక్షణ చేయడంలో ఏసీపీ దుర్గారావు వన్ టౌన్ సిఐ గుణారం వన్ టౌన్ పోలీస్ సిబ్బంది చూపించిన ప్రత్యేక భక్తితత్వంతో



చేసిన బందోబస్తు ఈ శాకంబరీ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రాఫిక్ డిసిపి షీరీన్ బేగం, పశ్చిమ ట్రాఫిక్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు ట్రాఫిక్ అధికారులు ఉమామహేశ్వరరావు రాజశేఖర్ భక్తులకు ఎక్కడ ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో శీనా నాయక్, పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ ), పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు ఉద్యోగులు సిబ్బంది, ఇలా ప్రతి ఒక్కరు శాకాంబరీ ఉత్సవాలు విజయవంతం చేయడంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడంలో కదంబ ప్రసాదాన్ని భక్తులకు అందజేయడం జరిగింది.2026 శాకంబరీ ఉత్సవాలు అమ్మవారి ఆలయ చరిత్రలోనే ఒక ప్రత్యేక స్థానం.బుధవారం ఉదయం పూర్ణాహుతితో శాకంబరీ ఉత్సవాలు ముగిశాయి.

# విజయవాడలో వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు

**పలు సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**

**సాయిబాబా కృపాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి - వెలంపల్లి**



విజయవాడ పశ్చిమ జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)గురుపూర్ణిమ మహోత్సవాలలో భాగంగా విజయవాడలోని పలు ప్రాంతాల్లో గల సాయి బాబా మందిరాలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మాజీ మంత్రి విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని బాబావారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గురుపూర్ణిమ పవిత్ర దినాన శ్రీ షిర్డీ సాయిబాబా వారిని దర్శించుకోవడం, భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.



మానవాళికి సాయిబాబా అందించిన ప్రేమానురాగాలు, శాంతి, సహనం మరియు సర్వధర్మ సమభావాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలన్నారు. ఆ షిర్డీ సాయిబాబా దివ్య ఆశీస్సులతో విజయవాడ నగర ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులందరి మధ్య ఈ మహోత్సవాన్ని జరుపుకోవడం అయన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు.స్థానిక గొల్లపాలెం గట్టు లోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరంలో గురుపూర్ణిమ సందర్భంగా బాబావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.స్థానిక పూర్ణానందపేట లోని శ్రీ షిర్డీ సాయి బాబా ధ్యాన మందిరంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.స్థానిక విద్యాధరపురం లోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం (చిన్న సాయి బాబా గుడి) నందు స్వామివారిని దర్శించుకున్నారు.శ్రీ గురు దత్త సాయి సేవా సమితి, పేర్ల రామస్వామి - పట్నాల అప్పన్న గారల ఆధ్వర్యంలో గురుపూర్ణిమ సందర్భంగా చిట్టినగర్ నగరాల కల్యాణమండపం సమీపంలో నిర్వహించిన మహ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా స్వామివారి ప్రసాదాన్ని వడ్డించారు.స్థానిక గొల్లపూడి, మహాత్మా గాంధీ కమర్షియల్ కాంప్లెక్స్ లోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.స్థానిక బీసెంట్ రోడ్ లోని శ్రీ సాయి బాబా గుడి నందు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.స్థానిక ముత్యాలంపాడు లోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరంలో జరిగిన మహోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రత్యేక ఫ్రాంచైజీ ప్రాజెక్టుల ద్వారా స్వయం ఉపాధికి డ్వాక్రా మహిళలకు సువర్ణావకాశం

విజయవాడ పశ్చిమ జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి ద్వారా డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక ఫ్రాంచైజీ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఇంచార్జి కమిషనర్ ఏ. రవీంద్రరావు బుధవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, పట్టణ నిరుద్యోగ మహిళలు, యువతులు తక్కువ పెట్టుబడితో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్థిరమైన ఆదాయాన్ని పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రముఖ బ్రాండ్ల సహకారంతో మల్టీ బ్రాండ్ మార్ట్లు, రిటైల్ స్టోర్లు, టీ ఽ స్నాక్స్ అవుట్‌లెట్లు, ఫుడ్ కోర్టులు, మిల్లెట్స్ మార్ట్‌లు, కాఫీ అవుట్‌లెట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బ్యూటీ సలూన్లు, ఎంబ్రాయిడరీ యూనిట్లు తదితర వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.వ్యాపారం నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ, బ్రాండ్ మద్దతు, మార్కెటింగ్ సహాయం, బ్యాంకు రుణాల సమన్వయం, ప్రభుత్వ పథకాల అనుసంధానం వంటి సేవలను మెప్మా ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు తమ సామర్థ్యానికి, ఆసక్తికి అనుగుణంగా ఫ్రాంచైజీని ఎంపిక చేసుకుని స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల డ్వాక్రా మహిళలు అర్హులని, సంబంధిత పత్రాలతో తమ ప్రాంత కమ్యూనిటీ ఆర్గనైజర్ (సి ఓ), టౌన్ లెవల్ ఫెడరేషన్ , సి డి ఓ , వివిసి కార్యాలయంలో గల యుసిడి విభాగం నందు లవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్ వారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ అవకాశాన్ని నగరంలోని అర్హులైన డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

## శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**108 మంది సువాసిని లకు చీర జాకెట్, పండ్లు పసుపు కుంకుమ పంపిణీ**



విజయవాడ పశ్చిమ జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో సి వి ఆర్ ప్లై ఓవర్ బ్రిడ్జి దిగువన తూర్పు వైపు ఉన్న ప్రసిద్ధి శ్రీదేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో గురు పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి 108 మంది సువాసిని లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.108 మందికి సామూహిక సువాసిని పూజ గురువర్యులు,శ్రీశ్రీశ్రీ కరుణానందనాథ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ శాంత రాజరాజేశ్వరి మూకాంబిక పీఠం పీఠాధీశ్వరి సద్గురు మాత పూజ్య శ్రీ శాంత అమ్మ పాల్గొని అమ్మగారి చేతుల మీదగా పీఠం తరపున పసుపు కుంకుమ చీర రవిక అందరికీ (108 మందికి )అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూజ్య గురువర్యులు యాబలూరి లోకనాథ శర్మ , కోడూరు బాలా త్రిపుర సుందరి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి అమ్మగారు అభిషేకం నిర్వహించి విశేష హారతులు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదములు అమ్మగారి చేతుల మీదగా జరిగాయి. ఈ సందర్భంగా శక్తి పీఠం లో ముక్తి కంఠంతో అమ్మవారి జపం చేశారు. కార్యక్రమంలో భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు.

## గురుపౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ విజయ దుర్గ అమ్మవారికి అభిషేకం



విజయవాడ పశ్చిమ జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)గురు పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ విజయ దుర్గ అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించమని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, చింతలపాటి పవన్ కుమార్ శర్మ తెలిపారు, బుధవారం మిల్క్ ప్రాజెక్ట్ భీమన వారి పేట వద్ద వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి నాడు అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అందులో భాగంగా ఈరోజు అమ్మవారికి వేకువజామునుండే అభిషేక కార్యక్రమాలు నిర్వహించమన్నారు, మహిళా భక్తులచే లలితా సహస్ర పారాయణం, నిర్వహించారు, గురు పౌర్ణమి సందర్భంగా ఈ అభిషేక కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు తీర్థ ప్రసాదాలను స్వీకరించారని తెలిపారు, ఈ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించామని తెలిపారు,

## శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ కే కన్న బాబు



విజయవాడ పశ్చిమ జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ కె. కన్నబాబు బుధవారం ఉదయం కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో దేవస్థానం అర్చక బృందం స్వాగతం పలికిన అనంతరం, వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను కన్నబాబు కి అందజేశారు.

## సమరసత బాలవికాస్ కేంద్రాల ప్రారంభం

**విద్యార్థినీ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసే బాలవికాస్ కేంద్రాలు-పొన్నపల్లి సత్యనారాయణ**



చెరుకుపల్లి మండలం జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)పవిత్ర గురుపౌర్ణాన్ని వ్యాస పౌర్ణాన్ని పురస్కరించుకొని టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన దేవాలయాలలో సమరసత బాలవికాస్ కేంద్రాలు ప్రారంభించేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీసి ఆధ్యాత్మిక వైపు విద్యార్థినీ విద్యార్థులను నడిపించుటకు మన సంస్కృతి సాంప్రదాయాలు పెద్దలను గౌరవించడం గురువులను గౌరవించటం తెలియచేసే విధంగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలియజే శారు. ఈకార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మరదాపు కోటేశ్వరరావు చింతల మురళీకృష్ణ మాతాజీ జయంపు కమల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు

● విద్యార్థులు సోషల్ మీడియా నుండి మంచిని మాత్రమే గ్రహించాలి ● సంస్కారం విద్య మాత్రమే పిల్లలకి ఇచ్చే అత్యుత్తమ ఆస్తి
● విద్యార్థుల ప్రతిభకు నగదు ప్రోత్సాహం అందించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ● 118 మందికి రూ.6.20 లక్షల పంపిణీ





**ఇబ్రహీంపట్నం, జూలై 29(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రతిభకు పేదరికం ఎన్నటికీ అడ్డంకి కాకూడదని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, విద్యారంగానికి కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మండల పరిధిలోని మూలపాడు అటవీశాఖ నగరవనం లో బుధవారం నిర్వహించిన "బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గంలోని 35 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న 118 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.6.20 లక్షల నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొని విద్యార్థులతో సరదాగా గడిపారు. ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు ఏకాగ్రతతో, పట్టుదలతో చదువుకొని తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. విద్యకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని, విద్యారంగంలో వచ్చిన సానుకూల మార్పులకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రతి ఏడాది ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు. సాంకేతికతను, సామాజిక మాధ్యమాలను మంచి పనుల కోసం మాత్రమే వినియోగించాలని, సెల్‌ఫోన్ యుగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాచారాన్ని సద్వినియోగం చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వసంత పిలుపుతో స్పందించిన విద్యార్థులు నగరవనంలోని సీతాకోకచిలుకల పార్కులో ప్లాస్టిక్ బాటిళ్లను స్వచ్ఛందంగా ఏరి పరిశుభ్రతకు తమ వంతు సహకారం అందించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



**ఇబ్రహీంపట్నం, జూలై 28(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి బి కాలనీ సెంటర్ వద్ద ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారుఈ వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు ఆయుర్వేద వైద్య డాక్టర్ మహమ్మద్ జునైద్. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. సుమారు 100 మంది ఈ వైద్య శిబిరంలో సేవలను వినియోగించుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఆయుర్వేదం మందులు అందజేస్తుందని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు డాక్టర్ జునైద్.

## ఘనంగా మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరావు జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం, జూలై 29(వార్తా ప్రభ ప్రతినిధి):**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హోంమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ తండ్రి వసంత నాగేశ్వరావు 80 జన్మదిన వేడుకలను ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గరికపాటి శివ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమం లో వసంత నాగేశ్వరావు, వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అభిమాన నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నుండి నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని, రాజకీయంగా, అభివృద్ధిలో ఆయన సూచనలు సలహాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండపల్లి సాయిబాబా మందిరంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**ఇబ్రహీంపట్నం, జూలై 29(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి ఖిల్లా రోడ్డు సమీపంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీవారు మాట్లాడుతూగురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హారతి,అనంతరం స్వామివారి కి అర్చకుల వేదమంత్రాల మధ్య పంచామృత అభిషేకాలను కన్నులపండువగా జరిపించారు. ఈ కార్యక్రమంలో బొర్రా కిరణ్,బొర్రా క్రాంతి కుమార్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మొదటి త్రైమాసికంలో రికార్డు స్థాయి రిటైల్ అమ్మకాలు నమోదు చేసిన "జేఎల్ఆర్ ఇండియా"

**విజయవాడ, జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కార్ల అమ్మకాల్లో జేఎల్ఆర్ ఇండియా సంచలన రికార్డులు నమోదు చేస్తూనే ఉంది. తాజాగా రికార్డు స్థాయిలో అత్యంత బలమైన మొదటి త్రైమాసిక రిటైల్ అమ్మకాల పనితీరును నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 27 మొదటి త్రైమాసికంలో 1,665 యూనిట్లను విక్రయించింది. ఇది గతేడాదితో పోలిస్తే (వై ఓ వై) 11 శాతం అధికం. ఈ త్రైమాసికంలో హోల్‌సేల్ అమ్మకాలు 1,694 యూనిట్లుగా నమోదయ్యాయి, ఇది గతేడాదితో పోలిస్తే 4 శాతం అధికం. ఆర్థిక సంవత్సరం 27 మొదటి త్రైమాసికంలో మొత్తం రిటైల్ అమ్మకాలలో 85 శాతం పైగా రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ మరియు డిఫెండర్ మోడళ్లే ఉన్నాయి. ఇది భారతదేశ లగ్జరీ ఎస్ యువి విభాగంలో వాటి బలాన్ని స్పష్టం చేస్తుంది. డిఫెండర్ కంపెనీ యొక్క అత్యధికంగా అమ్ముడైన మోడల్‌గా నిలిచింది, ఇది భారతదేశంలో దాని 'టఫ్ లగ్జరీ' ప్రతిపాదనకు కొనసాగుతున్న ఆదరణను తెలియజేస్తుంది. ఇక ఈ త్రైమాసికంలో, జేఎల్ఆర్ ఇండియా-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీ ఏ ) కింద రేంజ్ రోవర్ ఎస్.వి మరియు రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్.వి మోడళ్లకు సవరించిన ధరలను ప్రవేశపెట్టింది. మోడల్‌ను బట్టి రూ. 75 లక్షల వరకు ప్రయోజనాలు లభించాయి. ఈ ప్రకటన వినియోగదారుల్లో ఆసక్తికి పెంచింది. ముఖ్యంగా ఎస్.వి కు సంబంధించి అన్ని విషయాలు తెలుసుకునేందుకు గణనీయంగా విచారణలు పెరిగాయి. రెండు మోడళ్లలోనూ బెస్‌పోక్ కమిషన్లకు డిమాండ్ పెరుగుతోందని జెఎల్ఆర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రాజన్ అంబా తెలిపారు. అత్యుత్తమ క్యూ1 రిటైల్ పనితీరుతో టాము ఎఫ్ వై 27ను బలంగా ప్రారంభించాం అన్నారు. రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ మరియు డిఫెండర్‌లకు డిమాండ్ పెరుగుతూనే ఉందన్నారు. ఇండియా యూకే ఎఫ్‌టిఏ తర్వాత ఎస్ వీ మరియు బెస్‌పోక్‌లపై ఆసక్తి పెరగడాన్ని గమనిస్తున్నామన్నారు. భారతదేశంలో లగ్జరీ ఆటోమోటివ్‌కు ఇది ఒక కీలకమైన ఘట్టంగా మేము ఎఫ్‌టిఏను స్వాగతిస్తున్నామని చెప్పారు.

## సాయిబాబా మందిరంలో జంపాల సీతారామయ్య ప్రత్యేక పూజలు

*గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం*



**ఇబ్రహీంపట్నం, జులై 29(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి 'బి' కాలనీ వద్దగల శ్రీ షిరిడి సాయి బాబా గుడిలో గురు పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య,జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్రావు (గాంధీ), పాల్గొన్నారు.గుడి ధర్మకర్త పామర్తి రాంబాబు వారిని ఆహ్వానించి సాయిబాబా కండువాతో సత్కరించారు. సాయిబాబా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి, ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు అందించారు. ఆ శిరిడి సాయినాథుని దయతో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఆషాఢ మాస వేడుకల్లో భక్తిశ్రద్ధలతో సీతమ్మ తల్లికి సారె సమర్పణ.

**బందరు కోట శ్రీ సీతారాముల ఆలయంలో లలిత సహస్ర కుంకుమ పూజలో పాల్గొన్న కాగిత శిరీష.**



**మచిలీపట్నం జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బందరు కోటలో వెలసిన శ్రీ సీతారాముల వారి దేవాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సతీమణి కాగిత శిరీష సీతమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా సారె సమర్పించి, లలిత సహస్ర కుంకుమ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొల్లు నీలిమ బోడె హేమ,యార్లగడ్డ జ్ఞానేశ్వరితో పాటు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన నిర్వహించి భక్తిపూర్వకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తి భావాన్ని చాటారు. ఆషాఢ మాసంలో సీతమ్మ తల్లికి సారె సమర్పించడం విశిష్ట సంప్రదాయమని, ఇటువంటి కార్యక్రమాలు సనాతన ధార్మిక విలువలను భావితరాలకు చేరవేస్తాయని భక్తులు పేర్కొన్నారు. ఆలయంలో నెలకొన్న భక్తిమయ వాతావరణం అందరినీ ఆధ్యాత్మిక అనుభూతికి లోనుచేసింది. ఈ సందర్భంగా సీతమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని, సమాజంలో ఆనందం, శ్రేయస్సు నెలకొనాలని భక్తిపూర్వకంగా ప్రార్థించారు. "భక్తి వెల్లువలో సీతమ్మ సారె వేడుకలు"నిర్వహించిన మహిళా మణులు "సీతమ్మ ఆశీస్సులతో సుఖశాంతులు ఉండాలని కోరుకున్నారు.

## మచిలీపట్నం క్రీడా అభివృద్ధికి కేంద్రం మద్దతు కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

● ఖేలో ఇండియా నిధులతో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి వినతి ● కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేకు వినతిపత్రం అందజేత ● రూ.26 కోట్లతో ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాల ప్రతిపాదన ● కృష్ణా జిల్లాను రాష్ట్ర స్థాయి క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం



**మచిలీపట్నం జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నంలో ఆధునిక క్రీడా మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని రాష్ట్ర గనులు, భూగర్భ, మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సేను న్యూఢిల్లీలోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా పథకం కింద మచిలీపట్నంలో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, 17 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక ఇండోర్ స్టేడియం, 9 కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తే కృష్ణా జిల్లా క్రీడా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని తెలిపారు. మొత్తం 26 కోట్లతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు జిల్లాలో క్రీడా మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు విస్తృత అవకాశాలు ఏర్పడటమే కాకుండా, భవిష్యత్తులో జాతీయ స్థాయి టోర్నమెంట్‌లను కూడా మచిలీపట్నంలో నిర్వహించే సామర్థ్యం పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి వారికి మెరుగైన శిక్షణ అందించేందుకు ఈ మౌలిక వసతులు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. కృష్ణా జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఖేలో ఇండియా పథకం ద్వారా ఈ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరితగతిన ఆమోదం తెలపాలని మంత్రి కొల్లు రవీంద్ర కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేను కోరారు. ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే మచిలీపట్నం క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందడంతో పాటు కృష్ణా జిల్లా యువతకు నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



**సంగం జూలై 29 (వార్తాప్రభ ప్రతినిది)** సంగంలోని తిరుమన కొండపై వెలసియున్న శ్రీ రాజరాజేశ్వరి దేవి జ్ఞానపీఠంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి శ్రీ రాజరాజేశ్వరానంద స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గురువుల విగ్రహాలకు భక్తులతో కలిసి విశేష పూజలు అర్చనలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గురువుల ఆశీస్సులు పొందారు. గురుపౌర్ణమి సందర్భంగా జ్ఞానపీఠం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. సంగం మండల కేంద్రంలోని సాయినగర్ లో వెలశియున్న శ్రీ సాయిబాబా ఆలయం లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా సాయి వ్రతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## "మెగా డీఎస్సీపై వైసీపీ విష ప్రచారం.! యువతను తప్పుదోవ పట్టించే కుట్ర"..!

● ఆధారాలు ఉంటే ప్రజల ముందుకు రావాలి.! ● అనుచిత ఆరోపణలు మానుకోవాలి.!
● ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్.!



**మచిలీపట్నం జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మెగా డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆరోపించారు. మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మెగా డీఎస్సీని కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని, ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను నిరాశకు గురిచేసిన నాయకులకు ఇప్పుడు విమర్శించే నైతిక హక్కు లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టి నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని పేర్కొన్నారు.మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి నియామకాలను అడ్డుకునేందుకు కోర్టుల్లో వరుసగా పిటిషన్లు దాఖలు చేసి అభ్యర్థులను మానసిక ఆందోళనకు గురిచేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. చివరకు ఎలాంటి ఆధారాలు సమర్పించలేక కేసులను ఉపసంహరించుకున్నారని, ఇప్పుడు మళ్లీ రాజీనామాల పేరుతో కొత్త వివాదాలకు తెరలేపడం రాజకీయ నాటకమేనని విమర్శించారు.వైఎస్సార్‌సీపీ నాయకులు బహిరంగ చర్చకు రావాలని ఎన్నిసార్లు ఆహ్వానించినా ఒక్క ఆధారాన్ని కూడా ప్రజల ముందుంచలేకపోయారని, నిజంగా అక్రమాలు జరిగి ఉంటే ఆధారాలతో బయటపెట్టాలని, లేకపోతే నిరాధార ఆరోపణలు మానుకోవాలని కాగిత కృష్ణ ప్రసాద్ సవాల్ విసిరారు. గతంలో గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, కడప జిల్లా పరిషత్ కారుణ్య నియామకాలు, 2006 డీఎస్సీ అంశాలపై ముందుగా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనకు కట్టుబడి ఉందని, నిరుద్యోగ యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఎన్నికల హామీల అమలుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తున్న ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ, ఐదేళ్లపాటు ఉద్యోగ నియామకాలు చేపట్టని వైఎస్సార్‌సీపీకి మెగా డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఉద్యోగాలు సాధించిన యువతలో భయాందోళనలు సృష్టించే రాజకీయాలను ప్రజలు తిప్పికొడతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోస్తా మురళీకృష్ణ, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, జిల్లా కార్యదర్శి వసంత కుమారి, మాజీ కౌన్సిలర్ కాసాని భాగ్యరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తాతయ్య చెప్పిన సూక్తులు

చెవులతో విననివి
కళ్ళతో చూడనివి
ఎప్పుడు నమ్మరాదు
ఊహించి చెప్పినవి
చెప్పుడు మాటలతో
చెడిపోవును స్నేహాలు
అసూయ ద్వేషాలతో
నాశనం బంధాలు
సహనం కోల్పోతే
వాయిదా వేసేస్తే
జరుగుతుంది నష్టము
అభివృద్ధికి విఘాతము
కలుపును క్షమాగుణము
తరుమును శత్రుత్వము
ప్రేమలను పూయించి
పంచును సంతోషము



-గద్వాల సోమన్న,

ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

## గురుపూజోత్సవం సందర్భంగా డాక్టర్ శోభరాజ్ కు ఘన సత్కారం




**శేరిలింగంపల్లి,జూలై 29 (వార్తాప్రభ):** గురుపూర్ణిమ సందర్భంగా హైటెక్స్ సమీపంలోని అన్నమాచార్య భావనా వాహిని-- అన్నమయ్యపురంలో పద్మశ్రీ డా.శోభారాజుకు గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు.108 మందికి పైగా శిష్యులు గురుపూజ సమర్పించి, అన్నమాచార్య సంకీర్తనలను ముక్తకంఠంతో ఆలపించి భక్తిరసాన్ని పంచారు.ఈ కార్యక్రమానికి సినీ నటుడు, రచయిత బాలాదిత్య ముఖ్య అతిథిగా హాజరై, డా. శోభారాజు అన్నమయ్య సంకీర్తనలను ప్రపంచానికి చేరవేస్తూ భక్తి సంగీతానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు.అన్నమాచార్య భావనా వాహిని మేనేజింగ్ ట్రస్టీ డా.నందకుమార్ గురుపరంపర విశిష్టతను వివరించగా,డా.శోభారాజు గురువు మహిమను వివరిస్తూ ఆధ్యాత్మిక సందేశం అందించారు.అనంతరం మంగళహారతి నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## మురికి కూపంగా మారిన డాక్రా భవనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులు



**జవహర్ నగర్, జూలై 29:(వార్తా ప్రభ):** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్ నగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ హాస్పిటల్ పక్కనే ఉన్నటువంటి డాక్రా భవన్ లో ప్రతి నెల దివ్యాంగులకు మరియు వృద్ధులుకు పింఛన్ పంపిణీ చేస్తారు.పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలతో పేరుకపోయిన చెత్తచెదారంతో మురికి కూపంగా మారిందని దివ్యాంగులు మరియు వృద్ధులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా వర్షాకాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. దివ్యాంగులు పింఛన్ తీసుకున్న కౌంటర్ల వద్ద కనీస రేకుల షెడ్డు కూడా లేకపోవడంతో ఎండకి ఎండుతూ వానకి తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కనీస వసతులు కల్పిస్తారని అధికారులను వేడుకుంటున్నాము.

## మారుతి సుజుకి న్యూ బ్రీజా కార్ ఆవిష్కరణ

**ఆవిష్కరించిన చెన్నుబోయిన చిట్టిబాబు, అక్కల గాంధీ**



**ఇబ్రహీంపట్నం, జులై 29(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి లో గల సంతోష్ మోటార్స్ లో మారుతి సుజుకి నూతన కార్ న్యూ బ్రీజా ను కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్రావు (గాంధీ) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ మోటార్స్ వారు మాట్లాడుతూ మధ్యతరగతి వారికి అత్యంత సౌకర్యంగా అందుబాటులో ఉండేలా మారుతి సుజుకి వారు తయారుచేసి మార్కెట్లోకి తెచ్చారని కారు యొక్క ప్రత్యేకతలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, వాసు,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై అధికారులతో చర్చ

**ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఆర్ల శ్రీనివాసులు**



**మర్రిపాడు జూలై 29 (వార్తాప్రభ)** మర్రిపాడు మండలంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఆర్ల శ్రీనివాసులు బుధవారం మండల స్థాయి అధికారులు ఎంపీడీఓ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) ఉపాధి హామీ పథకం ఏపీఓలను మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఘనంగా శాలువా కప్పి సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా మండలంలోని ఎస్సీ ఎస్టీ వర్గాల వారి సంక్షేమం మరియు వారి సమస్యలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు ఉపాధి అవకాశాలు పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు.ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నూతలపాటి రామకృష్ణ నూతలపాటి రమణయ్య అనకర్ల వెంకటయ్య సగిలి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదం చేస్తాయి

- ఉద్యోగులు ప్రతిరోజూ ఏదో ఒక క్రీడకు సమయం కేటాయించాలి
- కలెక్టరేట్ ఇగ్నైట్ సెల్‌లో క్రీడా పరికరాల ప్రదర్శనను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ





**విజయవాడ, జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతిరోజూ కొంత సమయాన్ని ఏదో ఒక క్రీడకు కేటాయించాలని ఆయన సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన క్రీడా పరికరాల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కొన్ని ఇండోర్ క్రీడలను స్వయంగా ఆడి సిబ్బందిని, సందర్శకులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ఆదాయ వనరులను పెంపొందించే ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతకు ప్రోత్సాహం కల్పించడం, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా జిల్లాలో సమగ్ర అభివృద్ధికి దోహదపడే సమాచార వేదికగా ఇగ్నైట్ సెల్ పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త" అనే లక్ష్యంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి శాఖ సేవలను ప్రజలకు చేరువ చేసే సమాచార వేదిక ఇగ్నైట్ సెల్ ద్వారా ప్రతిరోజూ ఒక ప్రభుత్వ శాఖకు సంబంధించిన సేవలు, పథకాలు, కార్యక్రమాలు, ఆ శాఖ రూపొందించిన ఉత్పత్తులు, ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని ప్రదర్శన రూపంలో అందుబాటులో ఉంచుతున్నామని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల ప్రజలకు ప్రభుత్వ శాఖల పనితీరు, అవకాశాలు, సేవలపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందన్నారు. ఈరోజు జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పరికరాలు, క్రీడలకు సంబంధించిన సమాచారాన్ని ప్రత్యేకంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడా శాఖ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు, వారికి లభిస్తున్న ప్రోత్సాహకాలు వంటి అంశాలను ప్రదర్శనలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని కలెక్టర్ అన్నారు. ప్రతి ఉద్యోగి, ప్రతి విద్యార్థి తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, ఉత్సాహభరితమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి కె.కోటేశ్వరరావు, క్రీడా శిక్షకులు, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సదాశివ బ్రహ్మేంద్ర ఆశ్రమంలో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు





**జగ్గయ్యపేట జూలై 29 (వార్తప్రభ)**

స్థానిక శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర ఆశ్రమంలో గురు పౌర్ణమి పర్వదిన మహోత్సవాలు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ రామానంద సరస్వతి స్వామి వారి దివ్య దిశానిర్దేశంలో శిష్యులు, భక్తజనం నడుమ అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో నిర్వహించబడ్డాయి. ఈ పావన వేడుకలలో మాజీ ప్రభుత్వ విప్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ సామినేని ఉదయభాను పాల్గొని, ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి శ్రీ రామానంద సరస్వతి స్వామి వారిని దర్శించుకుని, వేద మంత్రోచ్చారణల నడుమ వారి దివ్య ఆశీస్సులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ రామానంద సరస్వతి స్వామి వారు భక్తులను ఉద్దేశించి దివ్య అనుగ్రహ భాషణం చేశారు."అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి, జ్ఞానమనే దివ్య జ్యోతిని వెలిగించే మహోన్నత శక్తి ఒక్క గురువుకే సాధ్యమన్నారు. మానవ జన్మ లభించడమే ఒక గొప్ప వరమైతే, ఆ జన్మను సన్మార్గంలో నడిపించే సద్గురువు లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. భగవంతుని కృప, గురువు యొక్క అనుగ్రహం ఎల్లప్పుడూ సత్ప్రవర్తన, ధర్మనిష్ఠ కలిగిన సత్పురుషులపైనే ఉంటాయన్నారు. సమాజంలో భక్తి, శాంతి, సోదరభావం వర్ధిల్లాలని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో కూడిన సన్మార్గంలో పయనించాలని హితవు పలికారు. గురు పౌర్ణమి పావన ఘడియలలో గురుదేవుల ఆధ్యాత్మిక బోధనలను స్మరించుకుంటూ, ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడమే నిజమైన గురుదక్షిణని పేర్కొన్నారు.వేడుకల అనంతరం ఆశ్రమానికి విచ్చేసిన భక్తులందరూ స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిదులు కృష్ణారావు, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది జగన్నాధ రావు పట్టణ ప్రముఖులు శ్రీరామ్ రామకృష్ణ వైస్ చైర్మెన్ తుమ్మల ప్రభాకర్, ఆశ్రమ అర్చకులు తేజ, మేనేజర్ రామశేషు, మస్తాన్, ఆశ్రమ సభ్యులు, శిష్య బృందం మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# పదవులు బాధ్యతగా భావించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు తన్నీరు నాగేశ్వరరావు పిలుపు**



**జగ్గయ్యపేట జులై 29 (వార్తప్రభ)** నియోజకవర్గం వత్సవాయి మండలం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో లభించిన పదవులను గౌరవంగా భావించి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు, వత్సవాయి మండలం వత్సవాయి గ్రామంలోని వాసవి కళ్యాణ మండపంలో బుధవారం జిల్లాస్థాయిలో వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన నాయకులకు మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు మరింత చేరువై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.పార్టీలో ఐక్యతే బలమని, వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా అందరూ ఒకే నాయకత్వంలో సమష్టిగా పనిచేస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, పదవి అనేది గౌరవంతో పాటు మరింత బాధ్యతను పెంచేదేనని అన్నారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించిన ఆయన, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి అవినీతికి ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. నియోజకవర్గంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నా ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సహజ వనరుల దోపిడీ, అవినీతి పాలనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని, రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల నాయకులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దాడి కేసులో ప్రధాన నిందితుడికి రిమాండ్

**దాడులకు పాల్పడితే జైలు ఖాయం. రౌడీషీట్ కూడా తప్పదు. హెచ్చరించిన మైలవరం పోలీసులు**



**మైలవరం :జులై 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మైలవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్వడం గ్రామంలో జరిగిన దాడి కేసులో ప్రధాన నిందితుడు పరగాటి జాను అలియాస్ జాన్ (34) ను మైలవరం పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించిందని స్థానిక ఎస్ఐ సుధాకర్ తెలిపారు.27 జూలై 2026 న వెల్వడం గ్రామంలో డ్రైనేజీ వివాదానికి సంబంధించిన పాత గొడవ నేపథ్యంలో నిందితుడు కర్రతో దాడి చేసి కోట వంశీకృష్ణ, అతని తండ్రి శ్రీనివాసరావు(30) తలపై తీవ్ర గాయాలు చేశాడు.వైద్యులు ఆ గాయాన్ని తీవ్ర గాయం గా నిర్ధారించారు. అదే ఘటనలో బాధితుడి తల్లిపై కూడా దాడి జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్న మైలవరం పోలీసులు దర్యాప్తు చేపట్టి, విశ్వసనీయ సమాచారం మేరకు 29 జూలై 2026 న వెల్వడం గ్రామ సెంటర్‌లో ప్రధాన నిందితుడిని అదుపులో కి తీసుకున్నారు.చట్టపరమైన అన్ని నిబంధనలు పాటిస్తూ అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా నిందితుడికి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.ఈ కేసులో ప్రధాన నిందితుడిపై రౌడీషీట్ తెరిచేందుకు కూడా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

**దాడులకు పాల్పడితే జైలు ఖాయం...రౌడీషీట్ కూడా తప్పదు:** గ్రామాల్లో వ్యక్తిగత కక్షలు, భూ వివాదాలు, డ్రైనేజీ తగాదాలు లేదా ఇతర చిన్నచిన్న గొడవల పేరుతో ఎవరైనా శారీరక దాడులకు పాల్పడితే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోమని మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు హెచ్చరించారు.దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి జైలుకు పంపించడంతో పాటు అవసరమైతే రౌడీషీట్లు కూడా తెరవబడతాయన్నారు.ఒక్కసారి దాడి కేసులో నిందితుడిగా మారితే అదే మీ స్వేచ్ఛా జీవితానికి చివరి రోజు కావచ్చు అనీ,నేర చరిత్ర నమోదవుతుందని పేర్కొన్నారు.నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు అనేక ప్రైవేట్ సంస్థలు కూడా నియామకాల సమయంలో పోలీస్ వెరిఫికేషన్ మరియు నేర చరిత్రను పరిశీలిస్తున్నాయనీ, దాడులు, శారీరక నేరాలు వంటి కేసుల్లో నిందితులుగా నమోదైతే, భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్, భద్రతా సంస్థలు, విదేశీ ఉపాధి వంటి అనేక ఉద్యోగ అవకాశాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని తెలియజేశారు.క్షణిక ఆవేశం జీవితాంతం బాధ కలిగించవచ్చు అనీ కోపంలో చేసే ఒక దాడి కుటుంబ భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేస్తుందన్నారు. ప్రజలంద రూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, ఎలాంటి వివాదాలైనా పోలీసుల సహాయంతో చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై రాజీ లేకుండా అత్యంత కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని సిఐ స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్



**విజయవాడ పశ్చిమ జులై 29 : (వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజా సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ,ఎన్డీయే కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ప్రజా దర్బార్'కు విశేష స్పందన లభిస్తోంది. ఎమ్మెల్యే ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలు ఆకారపు విజయ కుమారి,బీ జోగేశ్వరరావు, కూర్మారావు ,దేవిన హరి ప్రసాద్, దుర్బేసుల హుస్సేన్ తో కలిసి వినతులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ఇళ్ల స్థలాలు, పింఛన్లు, వైద్య సహాయం, రేషన్ కార్డులు, స్థానిక సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు..చాలా వరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, మిగిలిన వాటిని సంబంధిత శాఖల ద్వారా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రజా దర్బార్ల ద్వారా నేరుగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కూటమి నేతలు తెలిపారు...

## గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి



**సంగం జూలై 29 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం మర్రిపాడు గ్రామంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ముందుగా గిన్నె భిక్ష కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి గరుడవాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. గరుడసేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ ఉత్సవాలు ఆలయ చైర్మన్ మందిపాటి శ్రీహరి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి.

## గురుపూజ, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కంటెస్టెంట్ కార్పొరేటర్ బోయినీ అనూష మహేష్ యాదవ్



**శేరిలింగంపల్లి,జూలై 29 (వార్తాప్రభ):** గురుపౌర్ణమి సందర్భంగా జనప్రియ అపార్ట్మె ంట్ ఫేజ్-1లో నిర్వహించిన గురుపూజలు, అన్నదాన కార్యక్రమ ంలో హఫీజ్‌పేట్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనుషా మహేష్ యాదవ్ పాల్గొన్నా రు.అనంతరం మియాపూర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు ,ఐశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించిన ఆమె,గురుపౌర్ణమి సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రత్యేక దృష్టి



**జగ్గయ్యపేట, జూలై 29 (వార్తప్రభ)** జగ్గయ్యపేట పట్టణంలోని తన కార్యాలయంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రజలు వినిపించిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శ్రద్ధగా విని, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఓపికగా విని, తక్షణ చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి కృతజ్ఞతలు తెలిపారు.

## జనగణన లో వివిధ పేర్లతో ఉన్న "యాదవులను" ఒకే పేరు తో "యాదవ్" గా నమోదు చేయాలి

**- అఖిల భారత యాదవ మహాసభ డిమాండ్.**



**విజయవాడ, జూలై 29: (వార్తప్రభ)** ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో ఉచ్చరిస్తున్నటువంటి యాదవులను రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా "యాదవులు" గాని జనగణలో నమోదు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కమిటీ సూచన మేరకు ఈరోజు విజయవాడలోని ఎన్ టీ ఆర్ జిల్లా కలెక్టరేట్ లో డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ అధికారి క్యాంపు కార్యాలయంలో నాయకులు జనగణన అధికారులు వెంకట్రామయ్య, భార్గవ్ రామ్ లను కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. భారతదేశంలో అనాదిగా ఉన్న వంశాలలో యయాతి సంతానంగా శ్రీకృష్ణుని వారసులుగా పేరెన్నికగన్న యాదవ జాతి చాలా ముఖ్యమైనదన్నారు. వివిధ ప్రాంతాలలో వివిధ పేర్ల తో పిలవబడుతూ, నేటికీ సంచార జాతులు గా, అర్ధ సంచార జాతులుగా పశు పోషణ, వ్యవసాయం పాల ఉత్పత్తి జీవనధారం గా కుల వృత్తి ని సంప్రదాయం గా కొనసాగిస్తూ గొల్ల కురుమ, గంగిరెద్దుల, కటిక కాడు గొల్ల, మందడి వంటి పేర్లతో పిలవబడుచున్న యదవులను ఒకే పదం లేదా బ్రాకెట్ లో "యాదవ్" ఉండేటట్లు జనగణన ఫార్మాట్ ను రూపొందించుటకు చర్యలు గైకొనాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ మహేశ్వరి యాదవ్ కోరారు.1931 లో మద్రాస్ ప్రెసిడెన్సీ వారు ఇచ్చిన జీవో 5240 ననుసరించి యాదవులను ఒకే పేరు తో గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర శతాబ్ది ఉత్సవ అధ్యక్షులు బొట్లా రామారావు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డక ఆంజనేయ మూర్తి యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎన్ నాగ మల్లేశ్వరి యాదవ్, యువజన నాయకులు డాక్టర్ ఉమాపతి యాదవ్ లు పాల్గొన్నారు.

## కరోనా నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి..

● గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో 200 మాస్కుల పంపిణీ..



**గుడివాడ,జూలై 29 (వార్తాప్రభ) :** కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మాస్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో జాయిన్ అయిన రోగులు, వారి అటెండర్లు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి కలిపి 200 మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా చిట్టూరి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్ మాట్లాడుతూ "కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. అందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. అలాగే తప్పనిసరిగా శానిటైజర్ వాడాలి. సామాజిక దూరం పాటించాలి" అని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి బచ్చు ఉమామహేశ్వరావు, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ శేగు బబిత, మరొక డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ గాదె మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి సిబ్బంది క్లబ్ సభ్యుల సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

## గాయపడిన జనసేన వీరమహిళ కనకదుర్గకు 25వేల ఆర్థిక సహాయం

● గుడివాడ జనసేన ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేయూత..



**గుడివాడ,జూలై 29 (వార్తాప్రభ) :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన వీరమహిళకు జనసేన పార్టీ అండగా నిలిచింది. గుడివాడ నియోజకవర్గ ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ప్రమాదంలో గాయపడిన వీరమహిళ గతవారం పట్టణం లోని 9వ వార్డుకు చెందిన జనసేన వీరమహిళ కనకదుర్గ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నాయకత్వం వెంటనే స్పందించింది. బుధవారం బూరగడ్డ శ్రీకాంత్ కనకదుర్గ కుటుంబాన్ని పరామర్శించి 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మజ్జి శ్రీనివాసరావు, సాయిన రాజేష్, సుంకర వెంకట్, షేక్ నాగూర్ బాషా, దాసరి మహేష్, జన్యావుల కిరణ్, సాయి పవన్, వైఎస్సార్, వెంకటేష్, షేక్ మీరా షరీఫ్, లోయ రాజా, గుండా మహేష్, ప్రసాద్ వీరమహిళలు గేదెల కళ్యాణి, శిరీష, కల్పన, నాగరాణి, నాగమణి తదితరులు కూడా పాల్గొని కనకదుర్గ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## శ్రీ తిరుపతమ్మ ఆలయం లో మూడు రోజుల పాటు విశేష ధార్మిక కార్యక్రమాలు...

--డిప్యూటీ కమిషనర్ మరియు ఈ ఓ లీలాకుమార్.....



**పెనుగంచిప్రోలు, జూలై 29 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లో ఎన్టీఆర్ జిల్లా కమీషనరు, దేవదాయ ధర్మదాయ శాఖ, విజయవాడ వారి ఉత్తర్వులను అనుసరించి, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము నందు లోక కళ్యాణార్థం మరియు సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని సంకల్పించి 30-07-2026 నుండి 01-08-2026 వరకు మూడు రోజులపాటు విశేష ధార్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించబడను న్నవి. ఈ కార్యక్రమములలో భాగంగా మొదటి రోజు వరుణ జపములు నిర్వహించబడును. రెండవ రోజు శ్రీ అంకమ్మ అమ్మవారికి 108 బిందెలతో ఘటాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడును. మూడవ రోజు వేద పండితుల ఆధ్వర్యంలో రుద్రహోమం, అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడును. ఈ మూడు రోజుల కార్యక్రమములలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందవలసిందిగా డిప్యూటీ కమిషనర్ మరియు ఆలయ ఈ ఓ, లీలా కుమార్ కోరడమైనది.

## శ్రీ తిరుపతమ్మ అమ్మ వారికి సారె సమర్పించిన ముండ్ల పాడు గ్రామస్తులు..



**పెనుగంచిప్రోలు,జూలై 29 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి సారె సమర్పించిన ముండ్లపాడు గ్రామస్తులు పెనుగంచిపోలు మండలశీ లోని ముండ్లపాడు గ్రామ భక్తులు సపరి పరివార దేవతల తో కలిపి శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి కాలినడకన వెళ్లి సారె సమర్పించారు. మేళ తాళాలు, కేరళ వాయిద్యాలతో ఆకట్టుకుంటూ పాటలు పాడుతూ శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి చేరుకొని బుధవారం ఆషాడం సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరరావు , మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుంటుపల్లి వాసు ,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు...

# ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి బలం..

---టిడిపి యువ నేత గద్దె క్రాంతి కుమార్..



**విజయవాడ (కృష్ణలంక),జూలై 29 (వార్తాప్రభ) :** ఇంటింటికి కూటమి ప్రభుత్వం' కార్యక్రమం లో భాగంగా తాము ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ కలిసి ఈ ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమ కార్యక్రమాలు గురించి తెలుసుకుంటూ ఈ ప్రభుత్వం పై వారి అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నామని, ప్రతి ఒక్క కుటుంబం కూడా కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో ఉన్నట్లుగా తెలియజేస్తున్నారని, ఇదే ప్రభుత్వ బలమని గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ఇంటింటికి కార్యక్రమం లో భాగంగా 20 వ డివిజన్ కృష్ణలంక లోని గల్లా కామేశ్వరరావు రోడ్డు లో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పర్యటించారు. అక్కడి స్థానికుల ఇంటింటికీ వెళ్లి, స్వయంగా కలిసి 'రెండేళ్ల అభివృద్ధి,సంక్షేమం, నమ్మకం' పేరు తో రూపొందించిన కర పత్రాలను పంపిణీ చేసి, కూటమి ప్రభుత్వం రెండేళ్ల లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమం సమన్వయంతో ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ వారి ఆర్థికాభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, యువతకు ఉద్యోగాలు, పెట్టుబడులు తీసుకురావడం లో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో మెరుగైన సేవలు, మౌలిక వసతుల కల్పనతో పాటు రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సౌకర్యాల అభివృద్ధి రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోందన్నారు. పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని గద్దె క్రాంతి కుమార్ అన్నారు. ఇంటింటి కార్యక్రమం ద్వారా ప్రజల సూచనలు, అభిప్రాయాలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు గల్లా శ్రీను, చింతా వెంకటేశ్వరరావు, కొడాలి సాయిబాబు, వన్నెం రెడ్డి రాధ, గల్లా సుబ్బారావు, బూత్, క్లస్టర్ ఇన్చార్జిలు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## ఉమ్మడిశెట్టి మౌనిక జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమం

● మానసిక దివ్యాంగుల చిన్నారులకు అన్నదానం చేసి మానవత్వం చాటిన ఆర్కే వారియర్స్..



**గుడివాడ,జూలై 29 (వార్తాప్రభ) :** పుట్టినరోజులను ఘనంగా కాకుండా సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలనే సందేశాన్ని చాటుతూ గుడివాడ ఆర్కే వారియర్స్ మరో మానవతా కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని చౌదరిపేటలో ఉన్న శిరీష ఫౌండేషన్‌లో ఉమ్మడిశెట్టి మౌనిక జన్మదిన వేడుకల సందర్భంగా మానసిక దివ్యాంగుల చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడిశెట్టి వారి కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమానికి సహకరించారు. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ సామాజికవేత్త, ఆర్కే వారియర్స్ వ్యవస్థాపకులు డాక్టర్ మాచర్ల రామ కృష్ణ మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో ఆకలి చావులు ఉండకూడదనే ఆలోచనతో పుట్టినరోజులు, పెళ్లి రోజులకు అయ్యే ఖర్చుతో వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు, రోడ్లపై ఉన్న అనాథలకు, యాచకులకు అన్నం పెడితే వారి ఆశీర్వాదాలతో పాటు భగవంతుని ఆశీస్సులు కూడా ఉంటాయని తెలిపారు. మౌనిక వారి కుటుంబ సభ్యులు చూపిన సేవా దృక్పథానికి ఆర్కే వారియర్స్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమం లో శివ, చరణ్, లంక రాంబాబు, అయ్యప్ప, ఆర్కే వారియర్స్ సభ్యులు మరియు ఉమ్మడిశెట్టి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పెద్ద ఎరుకపాడు గంగానమ్మ ఆలయంలో "శాకంబరి మాత అలంకరణ"

● భక్తులకు కనువిందు చేసిన అమ్మవారి దర్శనం..



**గుడివాడ,జూలై 29 (వార్తాప్రభ) :** పట్టణ పరిధిలోని పెద్ద ఎరుకపాడులో వేంచేసి ఉన్న ప్రసిద్ధ శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో బుధవారం భక్తులకు ప్రత్యేక దర్శన భాగ్యం లభించింది. శ్రావణ మాసంలో భాగంగా అమ్మవారిని శాకంబరి మాత అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా గంగానమ్మ తల్లిని రకరకాల కూరగాయలు, పండ్లు, ఆకులతో అద్భుతంగా అలంకరించారు. శాకంబరి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని చూసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పూజార్లు వేద మంత్రాలతో అమ్మవారిని కొలిచారు. భక్తుల హర్షంశాకంబరి అలంకరణలో ఉన్న గంగానమ్మను దర్శించుకున్న భక్తులు పూలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసంలో ప్రతి బుధవారం ప్రత్యేక అలంకరణలు ఉంటాయని, భక్తులందరూ విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అర్చకులు కోరారు.

## వార్డు మనదే మండలం మనదే ఓటరు దేవుళ్ళ ఆశీస్సులు మనకే

● మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు సంబారు నాగలక్ష్మి





**విస్సన్నపేట,జూలై 29 (వార్తాప్రభ) :** స్థానిక పద్మశాలి వీధిలో ఇంటిం టా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా విస్సన్నపేట క్లస్టర్ 7 ఇన్చార్జి నెక్కలపు శ్రీనివాసరావు (డాబా శ్రీను ) , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల రాధాకృష్ణ, తెలుగు మహిళా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నాదెళ్ల నాగమణి పాల్గొన్నారు. శ్రీ సీతారాముని ఆలయ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం టిడిపి మండల మహిళా అధ్యక్షు రాలు సంబారు నాగలక్ష్మి వీర తిలకం దిద్దారు. ప్రస్తుతం తాము పూజ లు నిర్వహించిన నాలుగవ వార్డు అయిన విసన్నపేట గ్రామపంచాయతీ అయినా మరియు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు కూడా ఓటరు దేవుళ్ళ ఆశీస్సులతో కూటమి పార్టీలు గెలుసుకోవడం తధ్యమన్నారు. క్లస్టర్ ఇంచార్జ్ దాబా శ్రీను మాట్లాడుతూ కులమత రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందించడం జరుగుతుందని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ 4000 రూపాయలు, వికలాంగ సోదరులకు సోదరీమణులకు 6000 రూపాయలు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అందించడం జరుగుతుందని తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా బడికి వెళ్లే పిల్లలందరికీ 13 వేల రూపాయల చొప్పున తల్లుల ఖాతాలలో ఇప్పటికే జమ కావడం జరిగింది అన్నారు. ప్రభుత్వపరంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాము ఎప్పుడు ప్రజల మధ్యనే ఉంటున్నామన్నారు . ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందుతున్న పథకాలను గుర్తు చేస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించేందుకు తాము వారదులం అవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సంబారు వెంకట ముత్యం తెలుగింటి ఆడపడుచులు పాల్గొన్నారు.

## వేలేరులో ఉచిత సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

● ప్రాజెక్ట్ రక్ష' ద్వారా 200 మందికి పైగా మహిళలకు ఉచిత పరీక్షలు -- క్యాన్సర్ నివారణపై అవగాహన






**హనుమాన్ జంక్షన్,జూలై 29 (వార్తాప్రభ) :** మహిళల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో వేలేరు రూరల్ హెల్త్ సెంటర్‌లో బుధవారం ప్రతిష్టాత్మక 'ప్రాజెక్ట్ రక్ష' ఉచిత సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రోటరీ నాయకులు, వైద్య నిపుణులు ప్రారంభించారు. వేలేరు, పరిసర గ్రామాల నుంచి వచ్చిన 200 మందికి పైగా మహిళలకు ఉచితంగా సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, పాథాలజీ విభాగం డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రూరల్ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రియ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కళ్యాణ్, డాక్టర్ సుహాసిని పాల్గొని క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, నివారణపై అవగాహన కల్పించారు. వేలేరు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేములపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు ఎంతో ఉపయోగకరమైన ఈ శిబిరాన్ని నిర్వహించిన రోటరీ క్లబ్‌ను అభినందించారు. ఈ శిబిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు రోటేరియన్ ఎస్. రవిప్రకాష్, కార్యదర్శి ఉప్పలపాటి రామకృష్ణ (రామ్కీ), కోశాధికారి జి. భానుప్రకాష్, డైరెక్టర్లు జి. శ్రీనివాస్, తోట సిల్వెస్టర్ పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళల్లో సెర్వికల్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే 'ప్రాజెక్ట్ రక్ష' ప్రధాన ఉద్దేశమని, భవిష్యత్తులోనూ ఇటువంటి ఆరోగ్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని రోటరీ ప్రతినిధులు తెలిపారు.

## టెట్ పరీక్షకు వెళ్ళే ఇన్ సర్వీస్ టీచర్లకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలి..

● డెమొక్రటిక్ పిఆర్టియు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి......



**విజయవాడ కృష్ణలంక,జూలై 29 (వార్తాప్రభ) :** రాష్ట్రం లో ఆగస్టు 5 నుండి జరగనున్న ఉపాధ్యాయుల టెట్ పరీక్షలకు హాజరవు తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సదుపాయం కల్పించాలని డెమొక్రటిక్ పిఆర్టియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ డి శ్రీను, జువ్వా జ్ఞానేశ్వర్ రాష్ట ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు అందరూ టెట్ పరీక్ష రాయవలసిన అవసరత ఏర్పడిన దృష్ట్యా ఉపాధ్యాయు ల సౌకర్యార్థం ఈ వెసులుబాటు కల్పించాలని ఉన్నత పాఠశాలలలో సబ్జెక్ట్ టీచర్ల కొరత ను పరిష్కరించడానికి ఎడ్యుకేషన్ ఇన్స్ట్రక్టర్లను తక్షణమే నియమించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## యల్.బి.ఆర్.సి.ఈ లో అమరావతి ఛాంపియన్ షిప్ క్రీడల పోటీలు



**మైలవరం,జూలై 29 (వార్తాప్రభ) :** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయి లో అమరావతి ఛాంపియన్ షిప్ క్రీడల పోటీలు నిర్వహించారు. పోటీలలో భాగంగా అండర్-23 విభాగంలో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు బాస్కెట్ బాల్ , కబడ్డీ , ఖో-ఖో వాలీ బాల్ , వెయిట్ లిఫ్టింగ్, చెస్ , అథ్లెటిక్స్ , బ్యాడ్మింటన్ వంటి వివిధ క్రీడలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అన్ని విభాగాలలో జిల్లా స్థాయిలో ఎంపిక అయ్యారని కళాశాల వైస్ ప్రి న్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిక అయిన విద్యార్థిని, విద్యార్థులను మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఎస్.దుర్గా రెడ్డి, ఎమ్.బేబీ రాణి,ఎస్.నటరాజ్ లను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందిం చారు.

## వైభవపేతముగా గురుపౌర్ణమి వేడుకలు..



**గుడివాడ,జూలై 29 (వార్తాప్రభ) :** శ్రీ ద్వారకా సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈరోజు వ్యాస పూర్ణిమ సందర్భముగా మరియు బాబావారిని ఘనంగా అభిషేకాలు, ప్రెసిడెంట్ దండమూడి సీతారామస్వామి వైస్ ప్రెసిడెంట్ మరియు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ద్వారకా సాయి సేవా సమితి వేడుకల్లో ఈవో గోపాలరావు, ఇతర సభ్యులు జవ్వాజి గంగరాజు, మానవతా కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీర శేషగిరిరావు మానవతా గుడివాడ అధ్యక్షురాలు నందమూరి పద్మజ శైలజ పోకూరి మోహనరావు ఇతర సభ్యులు చలువది మోహన్ రావు దంపతులు కాత్యాయనితో సహా, సామినేని మోహన్ రావు దంపతులు చింతలూరి సత్యనారాయణ ఉమాదేవి బి రాధాకృష్ణ, యార్లగడ్డ సుధారాణి సాంబశివరావు గోపాలకృష్ణమూర్తి ఎల్లమంద, మెరుగుమాల బ్రహ్మయ్య, మరడాని వెంకటేశ్వరరావు, వెంకన్న బాబు, టంగుటూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొప్పెర్ల గ్రామంలోఇంటింటి కీ టీడీపీ కార్యక్రమం...

-పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత



**పెడన,జూలై 29 (వార్తాప్రభ) :** పెడన మండలం కొప్పెర్ల గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం అభివృద్ధి" కార్యక్రమంలో శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ నియోజకవర్గ పరిశీలకులు షేక్ ఆషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అర్జా నగేష్ శలపాటి ప్రసాద్ మాజీ సర్పంచ్ కాగిత నాగబాబు కాగిత వాసు మురాల ఫణి గాజుల భార్గవ్ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సంప్రదాయ వస్త్ర సోయగం.. ఇండియన్ సిల్క్ గ్యాలరీ

● 14 రాష్ట్రాల హస్తకళాకారుల అత్యద్భుత డిజైన్లకు వేదిక ● ఈ నెల 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అందుబాటులో
● జిల్లా వస్త్ర ప్రియులు ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోవాలి ● కేశినేని జానకి లక్ష్మి

**విజయవాడ, జూలై 29 (వార్తాప్రభ) :** భారతీయ వస్త్ర సంప్రదాయం, కళాత్మకతకు ప్రతీకగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిలుస్తుందని.. 14 రాష్ట్రాల హస్తకళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అత్యద్భుతమైన డిజైన్లకు ఇది సరైన వేదిక అని కేశినేని జానకి లక్ష్మి అన్నారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పోను బుధవారం కేశినేని జానకి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ చేనేత, పట్టు వస్త్ర సంపదకు పుట్టినిల్లుగా నిలిచిందని.. దేశంలోని ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకమైన కాటన్, పట్టు వస్త్ర సంప్రదాల విశిష్టత ఉండటం భారతీయ నేత కళాకారుల అపూర్వ నైపుణ్యానికి, మన సంస్కృతి వైభవానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి చీర వెనుక నేతన్నల శ్రమ, కళాత్మకత, తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం దాగి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉప్పాడ, ధర్మవరం పట్టు చీరలు, తమిళనాడులోని కాంచీపురం పట్టు, కర్ణాటకలోని మైసూర్ సిల్క్, తెలంగాణలోని గద్వాల్, పోచంపల్లి ఇక్కత్, పశ్చిమ బెంగాల్‌లోని బాలుచరి, తాంతి సిల్క్, ఒడిశాలోని సంభల్పురి ఇక్కత్, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి బెనారసీ సిల్క్ వంటి దేశంలోని ప్రసిద్ధ చేనేత, పట్టు వస్త్రాలు భారతీయ నేత కళా వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని అన్నారు. ఈ అరుదైన, నాణ్యమైన వస్త్రాలను ఒకే వేదికపై నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావడం



అభినందనీయమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ధృవీకరించిన సిల్క్ మార్క్ కలిగిన ఉత్పత్తులను మాత్రమే ప్రదర్శనలో విక్రయించడం వినియోగదారులకు నాణ్యతపై మరింత విశ్వాసాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లకుండానే భారతీయ పట్టు, చేనేత వైవిధ్యాన్ని ఒకేచోట వీక్షించి, తమకు నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసేందుకు ఈ ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో చక్కటి అవకాశాన్ని కల్పిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కేశినేని జానకి లక్ష్మి తెలిపారు.

**ఈ నెల 29 నుంచి ఆగస్టు 3 వరకు గ్యాలరీ:** ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఈ నెల 29వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అయిదు రోజుల పాటు అలరిస్తుందని ఎక్స్‌పో నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. చందేరి, మహేశ్వరి, కోట, రాజ్‌కోట్ పటోలా.. ఇలా వివిధ ప్రాంతాల ప్రత్యేక డిజైన్ల చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ప్రజలకు అందుబాటులో ఉంటుందని, కుటుంబ సమేతంగా వచ్చి భారతీయ చేనేత, పట్టు వస్త్రాల వైవిధ్యాన్ని వీక్షించి నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, ప్రత్యేక సందర్భాలకు అనువైన పట్టు చీరలు, చేనేత వస్త్రాలు, డ్రెస్సు మెటీరియల్స్, దుపట్టాలు తదితర ఉత్పత్తులు విస్తృతంగా ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. అన్ని వస్త్రాలను నేరుగా నేత కళాకారులు, సహకార సంఘాలు, ప్రామాణిక తయారీదారులే ప్రదర్శిస్తుండటం వల్ల నాణ్యతతో పాటు సరసమైన ధరల్లో వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వినియోగదారులు స్వచ్ఛమైన పట్టు వస్త్రాలను నమ్మకంగా కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఎం.మంజుల తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో యాదవ అభ్యర్థికి టికెట్ ఇవ్వండి..

---టిడిపి చీఫ్ పల్లా కు అఖిల భారత యాదవ మహాసభ నాయకుల వినతి



**విజయవాడ, జూలై 29 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్ ను కలిసి త్వరలో గవర్నర్ కోటాలో భర్తీ చేయబోయే శాసనమండలి స్థానాలలో ఒక స్థానాన్ని రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో యాదవ హైకోర్టు సీనియర్ న్యాయవాది గొలగాన అప్పారావు యాదవ్ బృందం వినతి పత్రం అందజేసింది. గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం బంపర్ మెజార్టీతో గెలవడంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులు విశేషంగా మద్దతు ఇచ్చారని వారు పల్లాకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ అనంతపురం జిల్లా అధ్యక్షులు అశ్వర్ధ యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు జైపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. తమ డిమాండ్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ దృష్టికి తీసుకెళ్తారని పల్లా హామీ ఇచ్చినట్లు యాదవ నేత పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ని తనిఖీ చేసిన జిల్లా డి.ఐ.ఓ. శరత్ బాబు



**పెనుగంచిప్రోలు,జూలై 29 (వార్తాప్రభ) :** మండల కేంద్రం మై న పెనుగంచిప్రోలు ప్రభుత్వం ఆసుపత్రి లో ఎన్ టీ ఆర్ జిల్లా ఆరోగ్య శాఖ డి ఐ ఓ శరత్ బాబు బుధవారం తనిఖీ నిర్వహించడం జరిగింది, ఆసుపత్రి లో ఎన్ని కాన్పు లుచేశారు,ఓ పి. కీ రోగులు వస్తున్నా రా రోజు ఓ పి కీ ఎంత మంది రోగులు వస్తన్నారు, గర్భిణీ స్త్రీ ల ను పరిశీలిస్తున్నారా అనే దానిపై ఆసుపత్రి సిబ్బంది కీ అవగాహన కల్పించి ఆసుపత్రి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తి పరిశారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ చై తన్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటకు కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు

● 'అభివృద్ధి--సంక్షేమానికి రెండేళ్ల నమ్మకం.. కూటమి ప్రభుత్వం' కరపత్రాలతో ఇంటింటా ప్రచారం
● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,జూలై 29 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూ-ర్తయిన సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన 'అభివృద్ధి--సంక్షేమానికి రెండేళ్ల నమ్మకం.. కూటమి ప్రభుత్వం' కరపత్రాలను స్థానిక పెద్ద మసీదు సెంటర్, కుమ్మరి బజార్ ప్రాంతాల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలకు తిరిగి ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జరుగుతోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజలే కుటుంబం.. ప్రజా సంక్షేమమే లక్ష్యం అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాబోయే రోజుల్లో నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తంగిరాల సౌమ్య గారు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, కూటమి నేతలు, కార్యకర్తల సహకారంతో నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## మంత్రులకు జర్నలిస్టు సంఘాల సత్కారం





**విశాఖపట్నం, జూలై 29 (వార్తాప్రభ) :** విశాఖపట్నంను సందర్శించిన వైద్య ,ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిలను లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పిఐబి )ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని అంబిక బీచ్ గ్రాండ్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా వర్క్ షాప్ కు ముఖ్యఅతిథిగా హాజరైన సత్య కుమార్ యాదవ్ సన్మానించారు .అదేవిధంగా విజేఫ్ క్లబ్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి హాజరైన కొలుసు పార్థ సారథిని జర్నలిస్టుసంఘాల ప్రతినిధులు సత్కరించింది. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, దాడుల నివారణకు కమిటీలు, రైల్వే పాసులు పునరుద్ధరణ తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకొని వచ్చారు. దానిపై సానుకూలంగా స్పందించిన మంత్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ,ఆంధ్ర ప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజయ కుమారి, కె .తిరుమలేశ్వర్, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా జాతీయ కౌన్సిల్ సభ్యుడు మొల్లి కమల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. రామచంద్రరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్,, ఎం శ్రీహరి, కడలి రాజేంద్రప్రసాద్, బి నారాయణరావు, పృధ్వి రాజు తదితరులు ఉన్నారు.

## డోర్ టు డోర్ కార్యక్రమంలో వీరాస్వామి



**నందిగామ,జూలై 29 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని కొత్త కంచల గ్రామంలో 73. బూతులో కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలను తెలియజేస్తూ ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరును మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి తెలిపారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో కంచల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీనివాసరావు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు రామిరెడ్డి స-ుబ్బారావు, మందడ పు వెంకటరావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్ షిప్ కు ఎంపికైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



**మైలవరం,జూలై 29 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి క్రీడా ఛాంపియన్ షిప్ 2026 కు మైలవరం నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయి పోటీలకు స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపిక అయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి బుధవారం తెలియజేశారు. పురుషుల వాలీబాల్ నందు 5 గురు, కబడ్డీ పురుషుల నుంచి ఒకరు, కబడ్డీ మహిళ విభాగం నుంచి ఇద్దరు, ఖో ఖో పురుషుల నుంచి ఒకరు , ఖో ఖో మహిళల నుంచి 8 మంది మరియు పురుషుల బ్యాట్మెంటన్ నుంచి స్టాండ్ బై గా 1 క్రీడాకారుడు ఎంపిక కావడం జరిగిందని వెల్లడించారు. మైలవరం లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడాంశాలలో జరిగిన ఎంపిక నందు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాధవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎంపికైన క్రీడాకారులు అందరికీ అభినందనలు తెలియ చేస్తూ జిల్లా స్థాయిలో కూడా మెరుగైన ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

## కామనగరువు ఆదిత్యాలో లిటిల్ చెఫ్





**అమలాపురం,జూలై 29 (వార్తాప్రభ) :** స్థానిక ఆదిత్య స్కూల్ కామనగరువు విద్యార్థినీ విద్యార్థుల తల్లులతో లిటిల్ చెఫ్ ప్రోగ్రాంను ప్రిన్సిపాల్ రామ ప్రసాద్,వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి సుధ ల పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. ప్రీ ప్రైమరీ మాతృమూర్తులు తమ సృజనాత్మకతతో , ఆత్మవిశ్వాసంతో ఫుడ్ వితౌట్ ఫైర్ అనే థీమ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను తయారు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా న్యూట్రిషనిస్టు టి . రేవతి పాల్గొని ఉత్తమ వంటకానికి బహుమతి ప్రధానం చేసారు. తరువాత జరిగిన కార్యక్రమంలో . రేవతి మాట్లాడుతూ పిల్లల ఆహార అలవాట్లపై అవగాహన, శుభ్రత , సమయపాలన మెరుగుపడతాయని తెలియజేసారు. ప్రతిరోజూ బడికి రావాలన్నా, బాగా చదువుకోవాలన్నా, మైదానంలో ఆటలు ఆడాలన్నా మీ శరీరానికి శక్తి కావాలి. ఆ శక్తి మనం తినే మంచి ఆహారం నుండి మాత్రమే లభిస్తుంది. "ఆరోగ్యమే మహాభాగ్యం". ఈ రోజు నుండి జంక్ ఫుడ్‌కు 'నో' చెబుదాం, ఆరోగ్యకరమైన ఆహారానికి 'ఎస్' చెబుదాం. అని ప్రసంగించి ఉత్తమమైన వంటకానికి విజేతలకు బహుమతి ప్రధానం చేసారు. బహుమతి పొందిన వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్ శేషా రెడ్డి , డైరెక్టర్, ఎన్ . శృతి రెడ్డి ఆదిత్య జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చలపతిరావు అభినందించారు.

## దస్తావేజు లేఖర్ల సమ్మెకు పీనిపే శ్రీకాంత్, ఏఐటీయూసీ సంఘీభావం



**అమలాపురం,జూలై 29 (వార్తాప్రభ) :** రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) పేరుతో ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాల వల్ల ఎన్నో సంవత్సరాలుగా దస్తావేజు లేఖర్లుగా జీవనం సాగిస్తున్న వారి ఉపాధి ప్రశ్నార్థకంగా మారుతుందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పీనిపే శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమలాపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న దస్తావేజు లేఖర్లు, సహాయకులు, టైపిస్టుల సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన పీనిపే శ్రీకాంత్ లేఖర్లకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. దస్తావేజు లేఖర్ల సమస్యలను ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, అమలాపురం ఏఐటీయూసీ నాయకుడు కొప్పుల సత్తిబాబు కూడా సమ్మె శిబిరాన్ని సందర్శించి లేఖర్లకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునికీకరణ పేరుతో ఆర్ఎస్‌కే కేంద్రాలను ఏర్పాటు చేసి దస్తావేజు లేఖర్ల జీవ-నోపాధిని దెబ్బతీయడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం జి.ఓ. నెం. 396ను వెంటనే రద్దు చేసి, దస్తావేజు లేఖర్ల ఉపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు జున్నూరి సురేష్, కన్వీనర్ మట్టపర్తి రాము, గౌరవ అధ్యక్షులు గుంటు ఫణిప్రసాద్, కార్యదర్శి పందిరి హరి, బొర్రా బుజ్జి, కడలి సత్యనారాయణ, గోపాలం, సిరిపల్లి మూర్తి, పృథ్వి శ్రీను, గుమ్మల నరేష్, కె.వి. నాగరాజు, కె. మహేష్, యల్లమెల్లి సత్యనారాయణతో పాటు సహాయకులు, టైపిస్టులు మరియు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సహస్ర ఘటాభిషేకం, రుద్ర హోమం..





**మోపి దేవి/అవనిగడ్డ, జూలై 29 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా, మోపిదేవిలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో లోకకళ్యాణార్థం సహస్ర ఘటాభిషేకం, రుద్ర హోమం లను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో వేద పండితులు క్రతువులను శాస్త్రానుసారం జరిపారు. వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, వరుణ దేవుని అనుగ్రహం కలగాలని ఆకాంక్షిస్తూ బుధవారం వరుణ సూక్త సహిత వరుణానువాక సహిత సహస్రఘటాభిషేకం, రుద్ర హోమం వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ సూపరింటె ండెంట్ అచ్యుత మధుసూదనరావు,ఆలయ సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బేరియాట్రిక్ సర్జరీ కాస్మెటిక్ కాదు ప్రాణాలను కాపాడే చికిత్స : డాక్టర్ జగన్మోహన్ రెడ్డి




**కాకినాడ,జూలై 29 (వార్తాప్రభ) :** ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి కంటే స్థూలకాయం (ఒబేసిటీ) మరింత ప్రమాదకరమైన ప్రపంచ ఆరోగ్య సమస్యగా మారిందని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, రోబోటిక్ ఢ బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. కాకినాడలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరు, భారత్‌లో ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సమస్య వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు, ఫుడ్ డెలివరీ యాప్‌లపై అధిక ఆధారపడటం వల్ల ఊబకాయం పెరుగుతోందని వివరించారు. బేరియాట్రిక్ సర్జరీ కేవలం అందం కోసం చేసే చికిత్స కాదని, తీవ్రమైన స్థూలకాయం ఉన్నవారికి ప్రాణాలను కాపాడే వైద్య విధానమని స్పష్టం చేశారు. బీఎంఐ 40కు పైగా ఉండి, వైద్యుల క్లినికల్ మదింపు అనంతరం అర్హులైన వారికి మాత్రమే ఈ శస్త్రచికిత్సను సూచిస్తామని తెలిపారు. బేరియాట్రిక్ సర్జరీ ద్వారా బరువు తగ్గడంతో పాటు మధుమేహం, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు తగ్గడమే కాకుండా సంతానోత్పత్తి సామర్థ్యం కూడా మెరుగుపడుతుందని చెప్పారు. అందుకే దీనిని మెటబాలిక్ సర్జరీగా కూడా పరిగణిస్తారని వివరించారు. గతంలో బేరియాట్రిక్ సర్జరీ చేయించుకుని ఆశించిన ఫలితాలు పొందని వారికి లేదా మళ్లీ సర్జరీ అవసరమైన వారికి హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'రీ-డూ బేరియాట్రిక్ సర్జరీ'లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి. సంతోష్ కుమార్, టీమ్ లీడర్ ఎస్.వి.వి. రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ సాయి కిరణ్ వి. తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188